జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 129 | హైదరాబాద్, ఫిబ్రవరి 26 శుక్రవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

# మీ మాజీ సీఎం చెప్పులు మోయడంలో నిపుణుడు

## ప్రధానమంత్రి నరేంద్రమోదీ



పుదుచ్చేరి,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిధి : ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ పుదుచ్చేరిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం నారాయణస్వామి.. పుదుచ్చేరి ప్రజలను విస్మరించారన్నారు. స్థానిక ప్రజలకు అబద్దాలు చెప్పారని, స్వంత నేతనే తప్పుదోవ పట్టించినట్లు ఆయన ఆరోపించారు. అబద్దాల సంస్కృతితో నిండిపోయిన ఆ పార్టీ నిజంగా ప్రజలకు సేవ చేస్తుందా అని కాంగ్రెస్ పార్టీని ప్రధాని మోదీ నిలదీశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పుదుచ్చేరిలో పర్యటించారు. ఆ సమయంలో ఓ మహిళ తమిళ భాషలో తమ ఇబ్బందులు విన్నవించుకున్నది. నివర్ తుఫాన్ సమయంలో ప్రభుత్వం పట్టించుకోలేదని ఆమె ఆరోపించింది. అయితే మాజీ సీఎం నారాయణ స్వామి.. ఆ మహిళ ఫిర్యాదును రాహుల్‌కు తప్పుగా తర్జుమా చేశారు. తుఫాన్ వేళ తమ ప్రభుత్వం ఆదుకున్నట్లు ఆ మహిళ చెబుతోందని రాహుల్ గాంధీకి తప్పుగా తర్జుమా చేసి చెప్పారు. ఈ విషయాన్ని ఇవాళ జరిగిన సభలో గుర్తు చేసిన మోదీ.. పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి దేశాన్ని తప్పుదోవ పట్టించినట్లు ఆరోపించారు. పుదుచ్చేరిలో ప్రజల మాట వినే ప్రభుత్వం ఉండాలని, ఢిల్లీలో ఉన్న కొంత మంది కాంగ్రెస్ నేతలు కాదన్నారు. పుదుచ్చేరిలో ఏర్పడబోయే ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వంగా ఉంటుందని, ఎన్డీఏ మీకు ఆ హామీ ఇస్తుందని మోదీ అన్నారు. పార్టీ హైకమాండ్ నేతల చెప్పులు మోడయంలో మాజీ సీఎం నిపుణుడని ప్రధాని ఆరోపించారు.

## ప్రభుత్వంపై హైకోర్టు సీరియస్




హైదరాబాద్,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిధి :ఆదేశాలను అమలు చేయనందుకు హైకోర్టు సీరియస్ అయింది. అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా బోర్డు ఏర్పాటులో జాప్యంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సభ్యులను నియమించాలన్న ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది. అధికారుల నిర్లక్ష్య వైఖరి ఆమోద యోగ్యం కాదనని కోర్టు పేర్కొంది. మిగతా 2లో..

## సోషల్ మీడియా విషయంలో..
## కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం:విజయశాంతి




హైదరాబాద్,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిధి : సోషల్ మీడియా విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని బీజేపీ సీనియర్ నేత విజయశాంతి తెలిపారు. ఓ దారి, తెన్ను, సరైన విధానాలు లేకుండా సాగుతున్న సోషల్ మీడియా, ఓటీటీ కంటెంట్ నియంత్రణకు కేంద్రం విధించిన నిబంధనలను స్వాగతిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తి స్వేచ్ఛ, భావ స్వేచ్ఛ పేరిట విద్వేషాన్ని రగిల్చే రాతలు, వీడియోలు ఇటీవలి కాలంలో పెచ్చు మీరిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటి కారణంగా ఎందరో వ్యక్తులు, కుటుంబాలు మనో వేదనకు గురయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నియంత్రణలేని సోషల్ మీడియా, ఓటీటీ తదితర కంటెంట్ వల్ల పలు సందర్భాల్లో వ్యవస్థల ఉనికి ప్రమాదంలో పడిందని, దేశ ఐక్యతకు కూడా ముప్పుగా మారుతోందన్నారు. మరీ ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా మహిళలపై వేధింపులకు పాల్పడే ఆకతాయిల సంఖ్య పెరిగిపోయిందని, ఇదే విషయంలో పలు మార్లు ఆందోళన కూడా వ్యక్తం చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. వీటన్నింటినీ నియంత్రించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలు అన్ని వర్గాలకూ శ్రేయస్కరమని విజయశాంతి హర్షం వ్యక్తం చేశారు.

# తరగతులు గడిచేదెలా..?



హైదరాబాద్, ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్రంలో బుధవారం నుంచి 6,7,8 తరగతుల విద్యార్థులకు ప్రత్యక్ష బోధన ప్రారంభించారు. ఈనెల ఒకటి నుంచి 9,10 ఆపై తరగతుల వారికి ఇప్పటికే చేపట్టిన విషయం తెలిసిందే. అయితే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకపోవడంతో కింది స్థాయి తరగతులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు వచ్చాయి. అందులో భాగంగానే బుధవారం నుంచి వచ్చేనెల ఒకటి వరకు 6,7,8 తరగతుల విద్యార్థులకూ ప్రత్యక్ష బోధనకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకనుగుణంగా విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్ర రామచంద్రన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖ హక్కు చట్టం ప్రకారం ఎనిమిదో తరగతి వరకు డిటెన్షన్ విధానం వర్తించబోదని స్పష్టం చేశారు. అంటే ఆ విద్యార్థులు పై తరగతులకు ప్రమోట్ అవుతారు. ఇప్పటికే 9,10 తరగతుల పిల్లలు బడులకు హాజరవుతున్నారు. తరగతి గదికి 20 మంది విద్యార్థులకే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బెంచీకి ఒకరు చొప్పున కూర్చుకోవాలని ఆదేశించింది. కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలనీ, విద్యార్థులు మాస్క్ ధరించాలనీ, శానిటైజర్ వాడాలనీ, భౌతిక దూరం ఉండాలని కోరింది. 8,891 సర్కారు బడుల్లో 6,7,8 తరగతులకు చెందిన విద్యార్థులు 6,88,742 మంది ఉన్నారు. 20 మంది చొప్పున వారికి 34,437 తరగతి గదులు అవసరమవుతాయి. సర్కారు బడుల్లో అన్ని తరగతి గదులున్నాయా?, ఉన్నవి సరిపోతాయా?అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోవిడ్ నిబంధనలు పాటించడం కష్టమేనని తెలుస్తున్నది. మిగతా 2లో..

## ఉద్యోగాల కల్పనలో ప్రతిపక్షాల అసత్య ప్రచారంపై ...
# మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తూ టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ విడుదల చేశారు. లేఖలో మంత్రి కేటీఆర్ ఈ విధంగా పేర్కొన్నారు. నిజం చెప్పులేసుకునే లోపు అబద్ధం ఊరంతా తిరిగొస్తుందన్న మాట ఇవాళ తెలంగాణలోని ప్రతిపక్షాలకు సరిగ్గా సరిపోతుంది. తమకు అలవాటైన అర్ధసత్యాలు, అసత్యాలతో ప్రజలను ముఖ్యంగా యువతను గందరగోళపరచడానికి ప్రతిపక్షాలు మరో కొత్త నాటకాన్ని మొదలుపెట్టాయి. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపట్టిన ఉద్యోగాల భర్తీ విషయంలో నిజాలను దాచి కాంగ్రెస్, బీజేపీలు చెబుతున్న అబద్ధపు మాటలు అందులో భాగమే. 2014 నుంచి వివిధ శాఖల్లో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్యను మీడియా ముఖంగా ప్రజల ముందుంచాను. దీంతో పాటు మా ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలను అంకెలతో సహా సాధికారికంగా వివరించాను. ఈ సమాచారం అంతా వివిధ శాఖల నుంచి తీసుకున్నదే. ఈ మేరకు 2014 నుంచి మిగతా 2లో..




## దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా
# తెలంగాణ మాక్ అసెంబ్లీ

- కనీవినీ ఎరుగని అపురూప దృశ్యంతో కనువిందు చేయబోతున్న బహుజన నాయకులు
- ఒక అసెంబ్లీ ఎలా ఉండాలో, ఎలా నడపాలో ప్రజల ముందు దృశ్యరూపం
- మీరెంతో మీకంత, మేమెంతో మాకంత అంటూ గళమెత్తిన పూలే,అంబేద్కర్ రాజ్యాధికారసమితి
- బహుజన నాయకులే ముఖ్యమంత్రి, మంత్రులుగా చట్టసభను నడిపే వినూత్న దృశ్యం



హైదరాబాద్ (ప్రజాపాలన) : బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పక్క తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో దిగ్విజయంగా ముగించుకొని బహుజనులు అధికంగా నివసించే తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నడిబొడ్డున రవీంద్ర భారతిలో మాక్ అసెంబ్లీ నిర్వహించబోతున్నాయి. బహుజనుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పూలే అంబేద్కర్ రాజ్యాధికారసమితి, అంబేద్కర్ రాజనీతి మూవ్ మెంట్,స్నేహ సంస్థలు. గత వారం రోజులుగా భాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికారసమితి జాతీయ కన్వీనర్ డాక్టర్. కటికల శివ భాగ్యారావు, బహుజన నాయకులు కలిసి మాక్ అసెంబ్లీ కి రూప కల్పన కొరకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో తెలంగాణ మాక్ అసెంబ్లీలో పాల్గొనబోయే ముఖ్యమంత్రి, రిప్రజెంటేటివ్ మంత్రులుగా బహుజన నాయకులను ఎన్నుకున్నారు. మాక్ అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా బహుజన నాయకుడు డాక్టర్ తాటికొండ వెంకట రాజయ్య ప్రాతినిధ్యం వహించ బోతున్నారు. రిప్రజెంటేటివ్ మంత్రులకు శాఖలు కేటాయించారు. మాక్ అసెంబ్లీలో మిగతా 3లో..





# విలేకరులకు అండగా కూకట్ పల్లి టి.డబ్ల్యూ.జె.ఎఫ్ : అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి




కూకట్ పల్లి,ఫిబ్రవరి25 (ప్రజాపాలన ప్రతినిధి) : కూకట్ పల్లి సర్కిల్ హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో అక్రమంగా జి.హెచ్.ఎం.సి అనుమతులు రాకముందే భావన నిర్మాణం పూర్తి చేయడవే కాకుకుండా అక్రమంగా నిర్మాణం జరుగుతుందని దినపత్రికలో ప్రచురించిన విలేకరులపై కేసులు పెట్టడాన్ని కూకట్ పల్లి టి.డబ్ల్యూ.జె.ఎఫ్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రవణ్, ప్రధాన కార్యదర్శి మండపాక కళ్యాణ్ చక్రవర్తి, యూనియన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నికార్సైన నిజాలను ప్రజలకు అందచేసే విలేకరులకు టి.డబ్ల్యూ.జె.ఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అన్యాయాలని అక్రమాలను దైర్యంగా వెలికితీసి రోజులో 24 గంటలు పనిచేస్తూ కుటుంబాన్ని వదిలి సమాజానికి సేవా చేస్తున్న విలేకరులపై కేసులు బుక్ చెయ్యడం చాలా బాధాకరం అని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆయుధం కలం అని, ఆ కలం శక్తిని ఎవ్వరు ఆపలేరని, అక్రమ కేసులు బుక్ చేసినంతమాత్రాన జర్నలిస్టులు భయపడరని తెలియచేసారు. పర్మిషన్ రాకముందే నిర్మాణం పూర్తి చేసిన భవనంపై చర్యలు తీసుకోవాలని కూకట్ పల్లి జి.హెచ్.ఎం.సి అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నరేష్, మోహన్, రమేష్, ఉమామహేష్, సుధాకర్, రాజు రెడ్డి, నరసింగరావు, లక్ష్మణ్, భిక్షపతి, మాలతి, రమేష్, విజయ్, బాబు, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

## మార్చి1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని విజయవంతం చేయండి




జగిత్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి ): ఎస్సి వర్గీకరణ సాధన కోసం దండోరా ఉద్యమంలో అమరవీరులను స్మరిస్తూ మార్చి1న మాదిగ అమరుల సంస్మరణ దినాన్ని గ్రామగ్రామాన అన్ని మండల కేంద్రాలలో మరియు మున్సిపాల్టీ వార్డులలో విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ దుమాల గంగారాం మాదిగ పిలుపునిచ్చారు. 26 సంవత్సరాల సుధీర్ఘ పోరాటంలో అన్నివర్గాల ప్రజలు రాజకీయ పార్టీల అండగ ఆగస్టు నెలలో సుప్రీంకోర్టు కూడ వర్గీకరణకు అనుకూలంగా తమ అభిప్రాయం వెల్లడించడం వెనుక దండోరా ఉద్యమకారుల అమరులవీరుల త్యాగం ఇమిడిఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడిగెల మల్లయ్య మాదిగ దుమాల పెద్దగంగారాం మాదిగ సురుగు శ్రీను మీసాల సాయిలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## రీలే నిరహార దీక్షలో సంగిభావం తెలిపిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి...





జగిత్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా సూపరిండెండెంట్ కార్యాలయంలో ముందు గత రెండు రోజులుగా విద్యుత్ సమస్యలపై రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులకు మద్దతుగా గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి వారికి సంగిభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. జీవన్ రెడ్డి వెంట రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బండ శంకర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉద్యోగులకు మద్దతు తెలిపారు.

## ఉద్యోగ ఉపాధ్యాయులపై ప్రభుత్వ కుట్రలు మానుకోవాలి

### యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.శ్యామ్ సుందర్, ఏ.భూమేశ్వర్

జగిత్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): బుధవారం టిఎస్ యూటీఎఫ్ జగిత్యాల జిల్లా ఆఫీస్ బేరర్స్ అంతర్జాల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా.చావ రవి మాట్లాడుతూ ముప్పై రోజులలో పీఆర్సీ కమిషన్ రిపోర్ట్ రావాలని త్రిసభ్య కమిషన్ వేసిన ముఖ్యమంత్రి ముప్పైమూడు నెలల వరకు ఆలస్యం చేసి సంఘాల పోరాటాల ఫలితంగా చర్చలకు పిలిచిన క్రమంలో టీఎస్ యూటీఎఫ్ తన బాధ్యతగా ప్రస్తుత ధరలకు అనుగుణంగా 45శాతం ఫిట్మెంట్, 20 లక్షల గ్రాట్యుటీ, ఇరవైనాలుగు వేల ప్రారంభ వేతనం, అలాగే సిపిఎస్ రద్దు, ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా 60సంవత్సరాల పదవీ విరమణ పెంపు తదితర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచడం జరిగిందని అధ్యక్షప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ తెలిపారు. దానిని రెండు వారాల తర్వాత కుట్రపూరిత ఆలోచనతో ఉద్యోగుల, ఉపాధ్యాయులను వేరు చేయనున్నట్టు పత్రిక లీకులు ఇచ్చి ఉద్యోగ ఉపాధ్యాయ లోకాన్ని సందిగ్ధంలో నెట్టే ప్రయత్నంచేస్తూ విభజించి-పాలించు అన్న చందంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అహంకార పూరితంగా ప్రవర్తించారని అనడం ఒక కుట్రగా భవిస్తున్నాం అలా జరిగి ఉంటే సిసి ఫుటేజీ ని బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తులసి ఆగమయ్య, ఉపాధ్యక్షురాలు సుశీల కోశాధికారి అనిల్, నాయకులు బన్న, జయంత్, పాత శ్రీనివాస్, శ్రీధర్, శోభ రాణి, సిరిపురం శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగాల కల్పనలో ప్రతిపక్షాల అసత్య ప్రచారంపై ...

# మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

2020 వరకు ఒక లక్షా 32 వేల 899 ఉద్యోగాలను భర్తీ చేశాము. ఉద్యోగాల కల్పనపై మా ప్రభుత్వ నిబద్ధతపై ఎవరికైనా అనుమానం ఉంటే ఆయా శాఖల్లో మరోసారి ధృవీకరించుకోవచ్చని మీడియా ముఖంగా తెలియచేశాను. అయితే ఈ నిజాలను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అసత్యాలతో తెలంగాణ యువతను అయోమయానికి, గందరగోళానికి గురి చేసే ప్రయత్నాలను నిన్నటి నుంచి చేస్తున్నాయి. జానారెడ్డి లాంటి సీనియర్ రాజకీయ నేత కూడా ఈ అసత్యాలను వల్లె వేసేందుకే మొగ్గు చూపడం బాధాకరం. అధికారంలోకి వస్తే ఉద్యోగాలు ఇస్తామని టీఆర్ఎస్ చెప్పినట్టు జానారెడ్డి ఈ రోజు మీడియాతో అన్నారు. అవును మూమ్మాటికి జానారెడ్డి చెప్పింది నిజమే. ఇచ్చినమాట ప్రకారం మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువతకు ఉద్యోగాలు కల్పిస్తూనే ఉన్నాము. ఇదే విషయాన్ని నిన్న నేను ప్రజల ముందుంచాను. అంతేకాదు తమ పదేళ్ల హయాంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో త్వరలో చెప్తామన్న జానారెడ్డి, అందులో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కూడా చెప్పాలని కోరుతున్నాను. జానారెడ్డి లాంటి సీనియర్ నాయకులతో పాటు ప్రతిపక్షాలు మీడియా ముఖంగా అవాస్తవాలు మాట్లాడుతున్న నేపథ్యంలో వారి దుష్ప్రచారాన్ని ఎండగట్టేలా మా ప్రభుత్వం భర్తీ చేసిన లక్షా 32 వేల 899 ఉద్యోగాల వివరాలను అంకెలతో సహా అందిస్తున్నాను. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా యువతకి మరోసారి స్పష్టత ఇచ్చేందుకు...ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలతో వారు అయోమయానికి గురికాకుండా ఉండే ఉద్దేశంతో ఈ వివరాలు ఇక్కడ జతపరుస్తున్నాను. వీటిని మరోసారి చూసైనా ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాన్ని మానుకుంటాయని ఆశిస్తున్నాను.

శాఖల వారీగా భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలు..

1. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - 30,594
2. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ -31,972
3. తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ రిక్రూట్మెంట్ బోర్డు- 3,623
4. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ - హైదరాబాద్ - 179
5. శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ స్టేట్ హార్టికల్చర్ యూనివర్సిటీ - హైదరాబాద్- 80
6. డైరెక్టర్, మైనారిటీస్ వెల్ఫేర్ - 66
7. జూనియర్ పంచాయతీ సెక్రెటరీస్ - 9,355
8. డిపార్ట్మెంట్ అఫ్ ఆయుష్ - 171
9. టీఎస్ జెన్ కో- 856
10. టీఎస్ ఎస్పీడీసీఎల్ - 164
11. టీఎస్ ఎస్పీడీసీఎల్ - 201
12. టీఎస్ ట్రాన్స్ కో - 206
13. టీఎస్-ఆర్టీసీ - 4,768
14. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్-12,500
15. జెన్కో, ట్రాన్స్ కో, ఎస్పీడీసీఎల్, ఎస్ పి డి సి ఎల్ - 6,648
16. విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ - 22,637
17. హైదరాబాద్ జలమండలి- 807
18. తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ - 243
19. డీసీసీబీలు - 1,571
20. భర్తీ ప్రక్రియ తుదిదశలో ఉన్న ఉద్యోగాలు - 6,258

మొత్తం ఉద్యోగాల సంఖ్య - 1,32,899

ఇలా ప్రభుత్వ శాఖల్లో అవసరమైన ఖాళీలను భర్తీ చేసన్తానే విప్లవాత్మకమైన టీఎస్ఐపాస్ విధానంతో ప్రైవేటు రంగంలో సుమారు 14 లక్షల ఉద్యోగాలను గత ఆరు సంవత్సరాల్లో తెలంగాణ యువతకు కల్పించాము. ఓ వైపు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పన చేపడుతూనే, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీని అత్యంత పారదర్శకంగా మా ప్రభుత్వం చేపట్టింది. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మా ప్రభుత్వం కొనసాగిస్తోంది. గత ప్రభుత్వాల హయాంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో ఉద్యోగాల భర్తీ అంటేనే అత్యంత అవినీతిమయం అన్న అపప్రద ఉండేది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అప్పట్లో అవినీతి పబ్లిక్ సర్వీస్ కమిషన్ గా పేరుపొందింది. కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో భర్తీ చేసిన ఉద్యోగాల కన్న ఎక్కువ ఉద్యోగాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మా ప్రభుత్వం భర్తీ చేసింది. అత్యంత పారదర్శకంగా జరిగిన ఈ నియామక ప్రక్రియ గురించి టీఎస్పీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన ఏ ఒక్క నిరుద్యోగి అడిగినా చెప్తారు. ఇదీ ఉద్యోగాల భర్తీ పై మా ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనం.

ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగాల కల్పన నిరంతర ప్రక్రియనే. ఆమేరకు తాజాగా గౌరవ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు గారు మరో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా భర్తీ ప్రక్రియ కొనసాగుతుంది. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మరింత వేగంగా పూర్తి చేస్తామనడంలో ఎవరికి సందేహం అక్కర్లేదు. మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో గత ప్రభుత్వాల కంటే ఎక్కువ నిబద్ధత, చిత్తుశుద్ధితో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితికి యువత అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కేవలం కొన్ని పార్టీలు, నాయకులు పనిగట్టుకొని చేసే అసత్య ప్రచారాల ప్రభావానికి లోనుకాకుండా యువత ఆలోచించాలని కోరుతున్నట్లు మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## తరగతులు గడిచేదెలా..?

(మొదటి పేజీ తరువాయి)

ఇంకోవైపు తరగతి గదులు ఎక్కువైతే ఉపాధ్యాయుల సంఖ్య పెరగాల్సి ఉన్నది. విద్యావాలంటీర్ల నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత వచ్చే అవకాశమున్నది. మరోవైపు తరగతి గదులను రోజూ శానిటైజ్ చేయడం, ప్రాంగణాలను, మరుగుదొడ్లను శుభ్రం చేసే పనులను స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలకూ స్వచ్ఛ కార్మికులను నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. మరో వైపుదేశంలో కోవిడ్ బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని అధికారులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నాటక, మహారాష్ట్ర, కేరళ, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నాయి. కరోనా కొత్తరకం వైరస్ వస్తున్నది. ఆయా ప్రభుత్వాలు మళ్లీ లాక్డౌన్ విధించే అంశాలను పరిశీలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 6,7,8 తరగతుల విద్యార్థులకు ప్రత్యక్ష బోధన ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడమేనని వాపోతున్నారు.

## ప్రభుత్వంపై హైకోర్టు సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

కోర్టులో విచారణకు కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీం హాజరయ్యారు. బోర్డు ఏర్పాటుకు 2019లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కమిషనర్ తెలిపారు. కార్మిక శాఖ ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవడానికి జాప్యం ఎందుకు? అని హైకోర్టు ప్రశ్నించింది. మార్చి 18న విచారణకు కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది.



## ఆధార్ సెంటర్ ను సందర్శించిన మేయర్ జక్క వెంకట్ రెడ్డి



మేడిపల్లి, ఫిబ్రవరి25 (ప్రజాపాలన ప్రతినిధి) :ఆధార్ కార్డులో మార్పులు చెయ్యడానికి మరియు నూతన ఆధార్ కార్డులు పొందడానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని మేయర్ జక్క వెంకట్ రెడ్డి కార్పోరేషన్ పరిధిలోని పర్వతాపూర్ వార్డ్ కార్యాలయంలో ఉన్న ఆధార్ సెంటర్ ను సందర్శించి సెంటర్ వారితో మరియు కస్టమర్లతో మాట్లాడారు. ఆధార్ సెంటర్ వారు సమయపాలన పాటించాలని మరియు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో 3 ఆధార్ సెంటర్లు బుద్ధానగర్ కమ్యూనిటీ హాల్, పర్వతాపూర్ వర్డ్ కార్యాలయం,పీర్జాదిగూడ ఆదర్శ నగర్ కాలనీలో ఉన్నాయని, ఆధార్ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని మేయర్ జక్కా వెంకట్ రెడ్డి సూచించారు .ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు బొడిగే రాందాస్ గౌడ్, టీఆర్ఎస్ నాయకులు బి.ఈశ్వర్ రెడ్డి, బొడిగే కృష్ణా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్యాట మల్లేశం మృతి పట్ల సంతాపం

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): ప్యాట మల్లేశం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్. వికారాబాద్ పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ప్యాట మల్లేశం హఠాన్మరణం పట్ల ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే మృతుని నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## స్వేరో జ్ఞాన యాత్ర సభ గోడపత్రిక విడుదల



వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి మండల పరిధిలోని అరూర్ గ్రామంలో గురువారం స్వేరో సర్కిల్ లో స్వేరో సర్కిల్ జిల్లా అధ్యక్షులు పోలేపాక కుమారస్వామి అధ్వర్యంలో స్వేరో జ్ఞాన యాత్ర ముగింపు సభ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్యతిథి గా స్వేరో ఇంటర్ నేషనల్ యాదాద్రి జోనల్ కార్యదర్శి సాలబద్రి మహేందర్ అడాప్ట్ మండల స్వేరో వారు మాట్లాడుతూ స్వేరో పని విధానం,ఆశయాల పైన మరియు స్వేరో గ్రామ కమిటీల గురించి మాట్లాడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.యన్.యమ్ శోభారాణి,మాజీ సర్పంచ్ పోలేపాక చేమ్మయ్య, సుంకిశాల పరమేష్, పోలెపాక రమేష్,స్వామి, బోగారం గణేష్,స్వామి, పోలేపాక మధు,లక్ష్మి నారాయణ,సర్కిల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 27న నిరుద్యోగ యువతకు ఫ్రీ ఆన్ లైన్ వెబినార్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, ప్రజాపాలన : జిల్లా ఉపాధి అధికారి కార్యాలయం వారి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్. ఐ. / కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే%శీ%దుకు ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ఫ్రీ ఆన్ లైన్ వెబినార్ (ఉచిత అవగాహన సదస్సు) నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి కాశిక వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు https://forms.gle/wnqcex4nnAENQqX3A లింకు ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## గ్రామాల్లో కొనసాగుతున్న టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు



వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి రా (ష్ట ముఖ్యమంత్రి కే సీ ఆర్ వి లు ప్ర వేం ర కం టి ఆర్ ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేములకొండ,వెల్వర్తి,కంచనపల్లి,దుప్పల్లి గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కెసిరెడ్డి జనార్ధన్ రెడ్డి మాజీ సర్పంచ్ గంగారం రవేష్ గ్రామ శాఖల అధ్యక్షులు సాయిని నాగేష్,కలుకూరి రాములు,చిట్యాల జంగయ్య,మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు చెవ్వ వెంకటేశం నాయకులు పిట్టల విజయలక్ష్మి,సకినాల రామ్మూర్తి,కాడిగళ్ల లింగయ్య,గునగంటి రాములు,పిట్టల కుమార్,కడవేరు యాదగిరి,గుండు పరుషరాములు,గన్నెబొయిన కవిత,వేముల విజయలక్ష్మి,కడవేరు సరోజ,నరేష్,మదన్,రఫెల్, వెంకటేశం,సిద్దార్థ్,దినేష్, పన్నాల పాండురెడ్డి,జక్క రాంరెడ్డి,దేగల శోభ,పన్నాల కమలమ్మ,పెద్దిటి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.




## దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా

# తెలంగాణ మాక్ అసెంబ్లీ





(మొదటిపేజీ తరువాయి)

రిప్రజెంటేటివ్ మంత్రులు ప్రతిపాదించబోతున్న బిల్లుల వివరాలిలా ఉన్నాయి. ఆరేపల్లి రాజేందర్ రిప్రజెంటేటివ్ హోమ్ మినిస్టర్ మాక్ అసెంబ్లీలో తాను ముఖ్యంగా మూడు బిల్లులను ప్రతిపాదించబోతున్నారు,రాష్ట్రంలో మహిళల కొరకు ప్రత్యేకంగా మహిళాడి జి పి ఏర్పాటు చేస్తామని, పోలీసుశాఖలో 50 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించేలా,ప్రత్యేక పోలీసు చట్టం అమలయ్యేలా బిల్లులు ఉంటాయి. నిశాంత్, రిప్రజెంటేటివ్ సినిమాటోగ్రఫీ మినిస్టర్ సినిమాటోగ్రఫీ మంత్రిగా తాను 100 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సినిమా స్టూడియోని ప్రభుత్వమే నిర్మించేలా,సినీ పరిశ్రమలో పనిచేసే ప్రతీ కార్మికుడికి ఆరోగ్య భద్రత, ఆర్థిక భరోసా అందేలా బిల్లులు ప్రవేశ పెట్టబోతున్నారు. డాక్టర్ వెంకటేశ్వర్లు రిప్రజెంటేటివ్ ఆరోగ్య శాఖ మంత్రి 24గంటలపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండేలా,కార్పొరేట్ ఆసు పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసు పత్రులు ఉండేలా బిల్లులను ప్రతిపాదించారు.

ఇందిరాదేవి రిప్రజెంటేటివ్ ప్రాథమికశాఖ మంత్రి తాను ప్రాథమిక విద్యలో ముఖ్యంగా ప్రభుత్వ బడులలో చిన్న పిల్లల డ్రాప్ ఔట్ లను నిలువరించేలా తల్లిదండ్రులను ప్రోత్సహించేలా,నిర్బంధవిద్య కొరకు,కేజీ నుండి పిజి వరకు ఉచితంగా విద్య కొరకు,విద్యావిధానాలు ఉండేలా మాక్ అసెంబ్లీలో బిల్లులను ప్రతిపాదించారు.

మల్లెల రామనాథం రిప్రజెంటేటివ్ వ్యవసాయ శాఖ మంత్రి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖలో కనీస గిట్టుబాటు ధరపై ఒక బిల్లు,5 ఎకరాల లోపు రైతులకే ప్రభుత్వ ఫలాలు అందేలా తన బిల్లులు ప్రతిపాదించారు.

ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొఫెసర్ శ్యామ్ సుందర్ ప్రతీ విద్యార్థి నైపుణ్యం అభివృద్ధి చెందేలా,ప్రతీ ప్రభుత్వ కాలేజీ లలో మౌలిక వసతుల కల్పనకు తన బిల్లులు ప్రవేశ పెడుతున్నారు. డి.రజిత – అవినీతి నిరోధక శాఖ రిప్రజెంటేటివ్ మంత్రి. సయ్యద్ చాంద్ పాషా మైనారిటీ రిప్రజెంటేటివ్ మంత్రి. కె.అశోక్ కుమార్,ఆర్.వాణి నాయక్ – గిరిజన శాఖ రిప్రజెంటేటవ్ మంత్రులుగా, లక్ష్మీనారాయణ – నీటిపారుదల శాఖ రిప్రజెంటేటివ్ మంత్రి. కె.సంధ్యారాణి – పంచాయతీ రాజ్ శాఖ రిప్రజెంటేటివ్ మంత్రి. హన్మంత్ ముదిరాజ్ – రోడ్లు,భవనాలు శాఖ రిప్రజెంటేటివ్ మంత్రి. ప్రొఫెసర్ డి ఎం రవిప్రసాద్ – సామాజిక మార్పు శాఖ రిప్రజెంటేటివ్ మంత్రి. ఎం.వెంకటయ్య – రెవెన్యూశాఖ , ఏ.బాలంకుష్ – గనుల శాఖ, కృష్ణ ప్రసాద్ – బీసీ వెల్ఫేర్, టి.వెంకటయ్య – బహుజన బ్యాంక్, గోవర్ధన్ – సోలార్ ఎనర్జీ, నారాయణ్ దాస్ – సమాచార ప్రసార మంత్రిత్వశాఖలకు రిప్రజెంటేటివ్ మంత్రులుగా మాక్ అసెంబ్లీలో తమ తమ శాఖలలో బిల్లులను ప్రవేశ పెట్టబోతున్నారు. బహుజనుల కొరకు, బహుజనుల అభివృద్దే ధ్యేయంగా బహుజనుల సమస్యలపై పోరాడే మన బహుజన సంస్థలతో చేయి చేయి కలిపి నడుద్దాం. బహుజనులకు రాజ్యాధికారం సాధించుకోవడానికి తోడ్పడే మాక్ అసెంబ్లీ లాంటి కార్యక్రమాన్ని దిగ్విజయం చేద్దాం అంటూ బహుజన నాయకులందరూ పిలుపునిచ్చారు.





**ఆస్తి పన్ను చెల్లించని కమర్షియల్ కాంప్లెక్స్‌కు వారెంట్ జారి చేస్తున్న అధికారులు**

### ఆస్తి పన్ను చెల్లించని నిర్వాహకులకు వారెంట్ జారీ

కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన): గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారంలో ఓ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్వాహకులు ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో గాజులరామారం సర్కిల్ అధికారులు నోటీసులు ఇచ్చి వారెంట్‌ను జారి చేశారు. ఈ సందర్భంగా వారెంట్ అధికారిణి సంగీత మాట్లాడుతూ సకాలంలో ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ శ్రీనివాస్‌రావు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ జోహర్, బిల్ కలెక్టర్ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కేటీఆర్ వర్గానికి షాకేనా..?

హైదరాబాద్, ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎవరికీ అంతు పట్టరు. ఆయన ఎప్పుడు ఎవరిని ప్రేమిస్తారో? ఎవరిని ద్వేషిస్తారో ఎవరికీ తెలియదు. అందుకే కేసీఆర్ తో ఆచితూచి ఎవరైనా వ్యవహరిస్తారు. చివరకు తన కుమారుడు కేటీఆర్ విషయంలోనూ కేసీఆర్ కఠినంగానే ఉన్నారా? ఉండదలచుకున్నారా? కేటీఆర్ వర్గంగా ముద్రపడిన వారిని పక్కన పెట్టాలని కేసీఆర్ డిసైడ్ అయ్యారా? వారికి చెక్ పెట్టాలనే భావించారా? అంటే గులాబీ పార్టీలు అవుననే అంటున్నాయి.కేసీఆర్ రెండోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేటీఆర్ అంతా తానే అయి చూసుకుంటున్నారు. రెండోదఫా అధికారంలోకి వచ్చాక కేటీఆర్ ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేశారు. ఇక కేటీఆర్ పేరుకే మంత్రి గాని, అన్ని శాఖల సమీక్షలు ఆయన నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా జిల్లా పర్యటనలు సయితం కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో చేస్తున్నారు. దీంతో కేటీఆర్ ముఖ్యమంత్రి అని ప్రచారం జోరుగా సాగింది.టీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సయితం కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని బలంగా ఆకాంక్షించారు. అయితే వారి అత్యుత్సాహంపై కేసీఆర్ నీళ్లు చల్లారు. తాను పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని చెప్పి ఆ ప్రచారానికి తెరదించారు. ఇది తాత్కాలికం కావచ్చు. చెప్పలేం. త్వరలో సాగర్ ఉప ఎన్నికతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో కేసీఆర్ ఈ ప్రతిపాదనను పక్కన పెట్టి ఉండవచ్చు. కానీ జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే మాత్రం కేటీఆర్ గ్రూప్ కు కళ్లెం వేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతుంది.ఇటీవల జరిగిన హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కేటీఆర్ వర్గాన్ని కేసీఆర్ పూర్తిగా పక్కన పెట్టారంటున్నారు. మున్సిపల్ ఎన్నికలను తన భుజాన వేసుకుని నడిపించిన కేటీఆర్ కొన్ని పేర్లు సూచించినా వాటిని కేసీఆర్ పరిగణనలోకి తీసుకోలేదని చెబుతున్నారు. తనకు అత్యంత దగ్గరయిన కేకేశవరావు కుమార్తె గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ గా ఉద్యమకాలం నుంచి తనతో ప్రయాణిస్తున్న మోతే శోభన్ రెడ్డి సతీమణికి ఇవ్వడం పార్టీలో చర్చనీయాంశమైంది. కేటీఆర్ వర్గంపై కేసీఆర్ గుర్రు తాత్కాలికమే కావచ్చు కాని ఈ చర్చ మాత్రం పార్టీలో జోరుగా సాగుతోంది.

# సెనగ రైతులకు కష్టాలు ఇంతింత కాదయా

నల్గొండ, ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిది :యాసంగి పంటలు చేతికందే సమయంలో రైతులకు సమస్యలు చుట్టుముడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలతో యాసంగి నుంచి కొనుగోలు కేంద్రాలు ఉండవని రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, గ్రామాల్లో ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు లేకపోయినా మార్కెట్ కేంద్రాల్లో పంటలు కొనుగోళ్లు జరుపుతామని పేర్కొంది. ఈ నేపథ్యంలో,, శనగ పంట చేతికొచ్చి సుమారు 20 రోజులు గడుస్తున్నా.. మార్కెట్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి నోచుకోలేదు. రెండు, మూడు రోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో పంటను ఆరబెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతేడాదీ మార్క్‌ఫెడ్ నుంచి కొనుగోలు చేస్తారని, కానీ ఈసారి ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదని రైతులు తెలిపారు. దీన్ని అదునుగా భావించిన వ్యాపారులు.. అందిన కాడికి దండుకుంటున్నారు. శనగ మద్దతు ధర రూ.5100 ఉండగా.. రూ.4000–4200 ధరకు పంటను కొనుగోలు చేసి రైతులను నిలువునా ముంచుతున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి తర్వాత శనగ పంట అత్యధికంగా సాగవుతున్నది. సుమారు లక్షా నాలుగు వేల ఎకరాల్లో సాగవగా.. నిజామాబాద్‌లో 28 వేల ఎకరాలు, కామారెడ్డిలో సుమారు 76 వేల ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికొచ్చి 20–25 రోజులవుతుండటంతో శనగలను ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదనీ, ఓ పక్క చిరుజల్లులు పడుతున్నాయని చేతికొచ్చిన పంట వర్షానికి తడిసిపోతే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం శనగ పంటకు రూ.5,100ల మద్దతు ధర ప్రకటించింది. కానీ ఇంకా కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభించకపోవడం గమనార్హం. దీనికి తోడు వాతావరణ మార్పులతో చిరుజల్లులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీన్ని ఆసరాగా మలుచుకున్న వ్యాపారులు.. పంటను క్వింటాకు రూ.4000–4200 చెల్లిస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే క్వింటాకు 1000 చొప్పున మిగిలేదని రైతులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే పంట దిగుబడి తగ్గిందనీ, గతంలో ఎకరానికి 10–11 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈసారి 6–8 మధ్య వచ్చిందని రైతులు తెలిపారు. ఇటు దిగుబడి లేక, అటు ధర తగ్గి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

# సెకండియర్ విద్యార్థుల సంగతేంటీ..?

హైదరాబాద్, ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిది :రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంతో తీవ్రంగా నష్టపోతున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకపోవడంతో ఫెయిలైన విద్యార్థులు పాస్ కావడానికీ, తక్కువ మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఇంప్రూవ్‌మెంట్ రాయడానికి అవకాశం లేకుండా పోయింది. ఏటా వార్షిక ఫలితాలు విడుదలైన వెంటనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. ఈ ఏడాది కరోనా వైరస్ విజృంభించడంతో షెడ్యూల్ ప్రకారం ఆ పరీక్షలు ఇప్పటి వరకు నిర్వహించ లేదు. అయితే కరోనా కేసులు తగ్గుముఖం పట్టిన తర్వాత ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులతోపాటు డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు నవంబర్, డిసెంబర్‌లో సెమిస్టర్ పరీక్షలను వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించాయి. అదే సమయంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించేందుకు ఇంటర్ బోర్డుకు అవకాశమున్నది. కానీ ఇంటర్ బోర్డు అలసత్వం ప్రదర్శించిందని విద్యార్థులు విమర్శిస్తున్నారు. దీంతో ఫెయిలైన వారితోపాటు తక్కువ మార్కులొచ్చిన విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు ఇంటర్ బోర్డు విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజును వసూలు చేస్తున్నది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంతోపాటు ప్రథమ సంవత్సరంలో ఫెయిలైన సబ్జెక్టులకు ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. అంటే ఈసారి ఇంప్రూవ్‌మెంట్ సౌకర్యం లేనట్టేనని స్పష్టమవుతున్నది.రాష్ట్రంలో 2019–20 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ కలిపి 4,80,555 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 2,88,383 (60.01శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 1,92,172 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. కరోనా తీవ్రత ఎక్కువ కావడంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులందర్నీ రాష్ట్ర ప్రభుత్వం పాస్ చేసింది. ఫీజు చెల్లించి పరీక్షకు హాజరు కానివారు, మాల్‌ప్రాక్టీస్‌లో దొరికిన వారినీ ప్రభుత్వం ఉత్తీర్ణులుగా ప్రకటించింది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఫెయిలైన 1,92,172 మంది విద్యార్థులకు ఆ నిర్ణయాన్ని వర్తింపచేయలేదు. దీంతో వారు తీవ్ర నిరాశ చెందారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులను ప్రభుత్వం పాస్ చేయకపోవడంతోపాటు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలనూ నిర్వహించలేదు. దీంతో తక్కువ మార్కులొచ్చిన వారు నష్టపోతున్నారు. రాష్ట్రంలో ఏ గ్రేడ్‌లో 1,64,245 మంది, బీ గ్రేడ్‌లో 78,610 మంది, సీ గ్రేడ్‌లో 31,962 మంది, డీ గ్రేడ్‌లో 13,566 మంది ఉన్నారు. అయితే 75 శాతం కంటే తక్కువ మార్కులొచ్చిన వారు బీ,సీ,డీ గ్రేడ్‌లో కలిపి 1,24,138 మంది ఇంప్రూవ్‌మెంట్ కోసం ఎదురుచూశారు.




ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 26, ఫిబ్రవరి 2021

# నేరం వారిది కాదు, 'ఆకలి'ది!

వాళ్లిద్దరిని అట్లా చంపుతున్న విడియోను చూస్తుంటే ఒళ్లు జలదరిస్తుంది. చనిపోయాడని ఖాయం అయ్యేదాకా వేటు మీద వేటు వేస్తుంటే, ఆ వెనక ఉన్న కారులో, ఆ వెనుక బస్సులో, ఎదురుగా మరో బస్సులో, రోడ్డు మీద ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు ఎట్లా చూశారో, ఎట్లా ఫోన్ కెమెరాలకు పనిచెప్పారో ఆశ్చర్యమే. ఆ రోడ్డు మీద అని మాత్రమే కాదు, ఆ వూర్లో, ఆ జిల్లాలో, ఈ రాష్ట్రంలో మాత్రం అట్లాంటివి జరగడం పెద్దగా అలవాటు లేదు, ఏదో హైదరాబాద్‌లో గూండాలూ రౌడీలు పాతకక్షలతో రోడ్ల మీద వెంటాడి నరుక్కోవడం ఉన్నది కానీ తెలంగాణ పల్లెల్లో ఇటువంటివి లేవు, కొత్త కొత్త పద్ధతులు ఇక్కడ కూడా వస్తున్నాయా, పల్లె తెలంగాణ, జిల్లాల తెలంగాణ ఏమి కానున్నది? తెలంగాణకు కొన్ని ముద్రలున్నాయి. వెనుకపడిన, పడేసిన ప్రాంతం అని, వివక్షకు గురైన ప్రాంతం అని ప్రత్యేక ఉద్యమం వాదించి, ప్రజలను సమీకరించగలిగింది. తమది ప్రత్యేక జీవనవిధానం అని, సామూహికతకు, ప్రాకృతిక జీవనానికి తెలంగాణ నెలవు అని, వ్యాపార విలువల కంటె మానవ విలువలకే ప్రాధాన్యం అని, పోరాటం, ప్రతిఘటన ఇక్కడి నెత్తుటిలో ఇంకిన గుణాలని.. ఇట్లా అనేక అభిప్రాయాలను తెలంగాణవారు తమ గురించి తాము విశ్వసిస్తారు, ఇతరులలో కూడా కొందరు తెలంగాణ గురించి అటువంటి అభిప్రాయాలు కలిగి ఉంటారు. న్యాయవాదుల జంట హత్య ఆ ముద్రలను ఒక్కసారిగా కుదిపివేసింది. లోపలివారు, బయటివారు కూడా భయవిస్మయంలో మునిగిపోయారు. "తెలంగాణాలో కూడానా!?!"ఆ హత్యల నేపథ్యం ఏదైనా అయి ఉండవచ్చు. హత్యల తరువాత వెలికి వస్తున్న కథనాల ప్రకారం హంతకులుగా భావిస్తున్నవారే కాదు, హతులు కూడా నేరచరిత్ర కలిగినవారే కావచ్చు. నిజానికి ఆశ్చర్యపడవలసింది కేవలం హత్యలకు కాదు. అవి జరిగిన పద్ధతికి. చేసినవారికి ఎంతో ధైర్యం ఉంది, తమకేమీ కాదు, బారా ఖూన్ మాఫ్ అన్న ధీమా ఉన్నది. అంతే కాదు, ఆ ధీమాను, ధైర్యాన్ని బాహాటంగా ప్రదర్శించి అందరికీ హెచ్చరిక చేయాలనే ఆసక్తి ఉన్నది. అది ప్రమాదకరం. అంతే కాదు, హత్య జరుగుతూ ఉన్నప్పుడు, జనం ప్రేక్షకులుగా, జరిగిన తరువాత అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంలో హెచ్చు ప్రమాదం ఉన్నది. చైతన్యం, పోరాటం, విప్లవం అని మాట్లాడిన సమాజం మౌనంగా ఉండడానికి, అణగారిపోవడానికి క్రమంగా అలవాటు పడుతున్నది, తెలంగాణ వీరపుత్రులు ఇప్పుడు ప్రత్యక్షంగా జరుగుతున్న దౌర్జన్యాల విషయంలోనూ గాంధీగారి కోతుల వలె మిగిలిపోతున్నారు.తెలంగాణ సమాజంలో క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతున్నది? ప్రత్యేక రాష్ట్రం రావడానికి ముందు దశాబ్దంలోను, తరువాత ఈ ఏడేళ్లకాలంలోనూ ఏఏ పరిణామాలు జరిగాయి? కొత్తగా ఏర్పడిన అధికార సామాజిక సమీకరణలు ఎవరెవరిని బలశాలురను చేస్తున్నాయి, ఎవరిని కుంగదీస్తున్నాయి? ప్రత్యేక రాష్ట్ర ప్రభుత్వం ఈ పరిణామంలో ఒక భాగస్వామిగా ఉన్నదా, లేదా, కాలగతికే వదిలేసిందా? సకల జనుల భాగస్వామ్యంతో సమష్టి పురోగతికి పథకరచన చేయాలన్న స్పృహ ఉద్యమం నుంచి అధికారానికి వచ్చిన నాయకత్వానికి ఉన్నదా? ఉద్యమ విలువల నుంచి పరిపాలనను సమీక్షించేవారు, ప్రభుత్వాన్ని నిలదీసేవారు ఒక్కరైనా చట్టసభల్లో ఉన్నారా?కేంద్రంలో తొలి యుపిఎ ప్రభుత్వం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత, తెలంగాణలో కూడా రాజకీయ ఆదాయాలు బాగా పెరిగాయి. అభివృద్ధి పేరిట మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులను చేపట్టడం, దాని ద్వారా అనుబంధ ఉత్పత్తిగా రాజకీయ ఆదాయాలను సమకూర్చుకోవడం జలయజ్ఞం నుంచి ముమ్మరమయింది. తెలంగాణ ఉద్యమం వేడెక్కుతుండడంతో, ఉమ్మడి రాష్ట్రంలో మునుపున్న దాని కంటె తెలంగాణ రాజకీయవాదులకు ప్రాధాన్యం పెరిగింది. ప్రత్యేక రాష్ట్రం గురించి మరీ నిబద్ధతతో ఉన్నవారిని మినహాయించి, తెలంగాణ రాజకీయవాదులలో అత్యధికులు ప్రలోభాలకు అందుబాటులోనే ఉండేవారు. తెలంగాణ రాష్ట్రసమితి శాసనసభ్యులను సైతం కొనుగోలు చేయడం అధికారపక్షానికి సులువుగా ఉండింది. ఇక, మేమూ ఉద్యమం చేశాము అని చెప్పే కాంగ్రెస్ పార్టీ నేతలు ఆఖరి నిమిషం దాకా అధికార పదవులను వదలకపోవడానికి కారణం కూడా అధికారంలో, దాని ప్రయోజనాలలో వారికి మంచి భాగస్వామ్యం ఉండడమే. ఆశ్చర్యకరంగా, ప్రత్యేక రాష్ట్ర అవతరణ తరువాత, తెలంగాణకు ప్రతిపత్తి, అధినాయకుడికి అధికారం వచ్చాయి కానీ, అనేక అంచెల నాయకశ్రేణికి నిర్ణయాధికారాలు దక్కలేదు. అధికారాన్ని, విధాన నిర్ణయాలను పూర్తిగా కేంద్రీకరించుకుని, ప్రజాప్రతినిధులకు, స్థానిక నాయకులకు ఎటువంటి అధికారాలూ చొరవా లేకుండా చేసి, అభివృద్ధి మార్గంలో రాష్ట్ర నాయకత్వం స్తబ్ధతను ఏర్పరచింది. వైఎస్ఆర్ తరహాలో తెలంగాణ రాష్ట్ర నాయకత్వం కూడా రాజకీయ ఆదాయ సమీకరణను కేంద్రీకృతం చేసింది. బడ్జెట్‌ను మొత్తం ఒకటి రెండు లక్ష్యాలకు పరిమితం చేయడంతో, మరే ఆర్థిక కార్యకలాపాలకూ ఆస్కారం లేక స్థానిక ప్రజాప్రతినిధులకు కాళ్లూచేతులూ కట్టేసినట్టయింది. దానితో అవకాశమున్నచోటల్లా స్థానిక వనరుల మీద రాబడిని పిండుకోవడానికి స్థానిక నాయకత్వం ఎగబడుతోంది. మన వనరులు మనకే.. అన్న నినాదాన్ని మరొక అర్థంలో చిల్లరదేవుళ్లు ఉపయోగించుకుంటున్నారు. ఇసుక, గ్రానైట్, గుట్టలు ధ్వంసం చేసే క్రషింగ్–.. ఇవి ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో స్థానిక అధికార నేతల ఆదాయమార్గాలు. ఇసుక, దాని ద్వారా వచ్చే అక్రమ ఆదాయం స్థాయి, అందులో ఇమిడి ఉన్న నేరం ఊహించడానికి కూడా కష్టమే. సిరిసిల్ల జిల్లాలో ఇసుకలారీల జోరు, రోడ్డు ప్రమాద మరణాలు, బాధితుల మీదనే కేసులు తెలిసినవే. ఒకవైపు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా లేక, అలంకారప్రాయంగా ఉండవలసి వచ్చిన నిస్పృహ, మరొకవైపు వచ్చే ఎన్నికలకు ఆర్థికంగా కూడా సిద్ధపడవలసి ఉన్న అగత్యం సిటింగ్ ఎమ్మెల్యేలలో అధికులను సులభ ఆర్జనల వైపు మళ్లిస్తున్నది. విధాన నిర్ణయాలలో ప్రమేయం ఇవ్వకున్నా, నియోజకవర్గంలో శాసనసభ్యుడిదే పైచేయి అన్న శాసనం కారణంగా, పోలీసు యంత్రాంగంపై మాత్రం అదుపు లభిస్తున్నది. దాని వల్ల భూకబ్జాలకు లభించే సహకారాన్ని ఊహించుకోవలసిందే. అదనంగా, పోలీసుల నుంచే కప్పాల వసూళ్లు, డిఎస్పీ స్థాయి దాకా బదిలీలకు ప్రతిఫలాలు. నేరం చేయవలసిన అవసరం, అవకాశం, పర్యవసానాల నుంచి రక్షణ అన్నీ సమకూరుతున్నప్పుడు, క్షేత్రస్థాయి నాయకుల మీద అవినీతి ఆరోపణలు, నేరకథనాలు ఎందుకు వినిపించవు? తమ ఆదాయమార్గాలకు ఎవరైనా అడ్డుగా నిలిచినప్పుడు, అధికారాన్ని ఉపయోగించి పరిష్కరించుకోవాలని ఎందుకు ప్రయత్నించరు? ఇక ఇసుకలు, గనులు, లాభసాటి పోలీసు ఆదాయాలు లేనిచోట్ల పాపం, ప్రజాప్రతి నిధులు తమ చేతిలో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల వాటాలతో కాలక్షేపం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర %--%రాయలసీమ సామాజిక నాయకత్వంలో ఉండిన అధికార సమీకరణలు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత అనివార్యంగా మారవలసి వచ్చింది. అంతర్గత సమస్యల విషయంలో ఆధారపడడానికి స్థానికేతర నాయకులెవరూ అందుబాటులో ఉండని స్థితిలో, తెలంగాణలోని ప్రాబల్య వర్గాలు, వర్ధమాన ప్రాబల్యవర్గాలు ఒక ఆచరణాత్మక సమీకరణంలోకి రావడానికి ప్రయత్నిస్తూ వస్తున్నాయి. కానీ, ఒక సుస్థిర సమీకరణం ఏర్పడడం లేదు. తీవ్రమైన ఆశాభంగం, నిస్పృహతో ఉన్న రెడ్డి సామాజికవర్గాన్ని ఉపశమింపజేయడానికి అధికారపార్టీ శతవిధాల ప్రయత్నిస్తున్నది. అదే వర్గానికి ఇతర పార్టీలు కూడా గురిపెట్టి ఉన్నాయి. కొత్తగా ఒక టుమ్రీ పార్టీ కూడా రావడానికి సిద్ధంగా ఉన్నది. ఇప్పట్లో జరగదనుకున్న బిసి కులాల సమీకరణ లేదా కొన్ని పెద్ద బిసి కులాల పటిష్టీకరణ ఇప్పుడు జరుగుతున్నది. ఆ పరిణామానికి ప్రోత్సాహం అనేక మార్గాల నుంచి వస్తున్నది. ఈ అనిశ్చిత, ద్రవాత్మక స్థితికి సంబంధించిన ఒడిదుడికులను తెలంగాణ సమాజం ఇంకా తీవ్రంగానే అనుభవిస్తున్నది. వర్ధమాన ప్రాబల్య వర్గాలు అటు పాలక కులాలతో ఘర్షణ పడుతున్నాయి. మరొకవైపు, అడుగున ఉన్న దళితులతో వ్యవహరించే తీరులో సమస్యలు వస్తున్నాయి. పది పదిహేనేళ్ల కిందటి దాకా, అందరూ బాధితులే, కలసి పోరితే కలదు లాభం అనుకున్న గ్రామీణ సమాజంలో, కొందరు అధికారానికి ఆదాయాలకు దగ్గరై, అది అహంకారాలకు దారితీసి, నిన్నటి సహచరుల మధ్య చిచ్చు రగులుతున్నది. ఇటీవల తెలంగాణలో జరిగిన అనేక పరువు హత్యల సంఘటనలను, అనేక చోట్ల గ్రామీణ ఉద్రిక్తతలను ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవలసి ఉన్నది.తెలంగాణ రాష్ట్రం అంటే ఒక ప్రత్యేక పరిపాలనా యూనిట్‌ను సాధించడం మాత్రమే కాదు. తెలంగాణ నిర్దిష్టతలను అర్థం చేసుకుని, తనదైన సొంత అభివృద్ధి మార్గాన్ని రూపొందించుకోవడం అని ఆచార్య జయశంకర్ విశ్వాసం. అనేక చారిత్రక కారణాల వల్ల, వికాసపథంలోకి రాలేకపోయిన వివిధ సామాజిక వర్గాలను అర్థవంతమైన భాగస్వామ్యంలోకి రప్పించడం జరగాలి. అందుకోసం ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఉన్నతీకరణకు అవకాశాలు కల్పించాలి. సామాజిక, సాంస్కృతిక ఉన్నతీకరణ లేకుండా కేవలం ఆర్థికవనరులు పెరిగినంత మాత్రాన, అది కూడా ఇసుక సొమ్ము, సబ్ కాంట్రాక్టులు, పర్సంటేజిల వంటి సులభార్జన అయినప్పుడు నిజమైన సాధికారత సిద్ధించదు. డబ్బుకు ఉండే వాసనే, అధికారానికీ వస్తుంది. జులాయి డబ్బు కిరాయి నేరాలను పెంచుతుంది. తెలంగాణ వెనుకబడిన కులాలలో ఆర్థిక పరిపుష్టి కలిగిన ఒకటి రెండు కులాలు, అందుకు తగిన నిష్పత్తిలో సామాజిక, విద్యావిషయిక పరిపుష్టిని ఇంకా సమకూర్చుకోలేదు. అటువంటి కొరతలను భర్తీ చేసే విజన్ ఉద్యమానంతర అధికార నాయకత్వానికి ఉండాలి. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తరువాత సమీకృత సామాజిక అభివృద్ధి ప్రణాళికను చేపట్టవలసి ఉండిన ప్రభుత్వం, శుష్కమైన విధానాలతో కాలం గడుపుతున్నది. ప్రశ్నించే వారు లేరు. ప్రశ్నించగలిగిన వారిని బలహీన పరిచారు. ఆ బస్సుల్లో ప్రయాణికుల మాదిరే అందరూ భయపడిపోయి ఉన్నారు లేదా అలవాటైపోయి ఉన్నారు.

## విశాఖ ఉక్కు తెలుగువారి సొత్తు.. తెలుగు వారికే చెందాలి



రెండు లక్షల కోట్ల విలువైన విశాఖ ఉక్కును 4850 కోట్లకు కేంద్రం అమ్మదలుచుకున్నపుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దగ్గర అప్పు చేసైనా సరే కొనికాపాడితే మంచిది. 30 వేల ఎకరాలు మనకే ఉంటాయి మన వనరులు మన ఉద్యోగాలు మనకే ఉంటాయి. రాష్ట్ర బడ్జెట్లో 5000 కోట్లు అనేది పెద్ద లెక్క కాదు. ఎంతో ఖర్చు చేస్తున్నాము. మన భూములు మనకే. మన సంపద మనకే. కేంద్రం ఏది అమ్మినా రాష్ట్రాలు ఎలాగైనా కొనెయ్యాలి. కాపాడాలి దేశాన్ని , వనరులను అమ్మకుండా కాపాడుకోవాలి.

కేంద్రానికి ప్రజలను ఖాళీ చేయించి భూములను రాష్ట్రమే సమకూర్చుతుంది. అని మరిచిపోరాదు. ఎవరు సేకరించినా భూమి మీద హక్కు రాష్ట్రాలదే. అందువల్ల భూములను , ఆ భూమిపై కొలువై వున్న పరిశ్రమలను తిరిగి రాష్ట్ర ప్రభుత్వమే సేకరించడం అవసరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఫెడరల్ సంబంధాలుంటాయి. కేంద్రం తనతో కాదనుకున్నపుడు రాష్ట్రమే పూనుకొని పరిశ్రమలను, భూములను, ఉద్యోగులను కాపాడుకోవలసి ఉన్నది.

ఇక నుండి కేంద్రం ఏది అమ్మినా రాష్ట్రాలే కొనుగోలు చేయడం ద్వారా ఆయా రాష్ట్ర ప్రజలను , వనరులను, ఉపాధి అవకాశాలను కాపాడ వలసి ఉంది. ప్రయివేటు పరం చేస్తే ఉపాధి అవకాశాలు సగానికిపైగా తగ్గి పోతాయి. భూములు , ఆస్తులు ప్రయివేటు పరమై ప్రజలకు అందకుండా, చెందకుండా పోతాయి. కనుక ఫెడరలిజం దృష్టికోణంలో రాష్ట్రాలు పూనుకొని కైవసం చేసుకోవడం అవసరం. అవసరమైతే తెలంగాణ , ఆంధ్ర రెండు రాష్ట్రాలు కలిసి కొని బయ్యారం, రాయలసీమ గనులను తవ్వి తోడి ముడి సరుకు మనమే సేకరించి ఆ ఉక్కు, ఇనుము మనమే వాడుకోవచ్చు .

– బి.ఎస్. రాములు .సామాజిక తత్వవేత్త
బి సి కమిషన్ చైర్మన్ తెలంగాణ రాష్ట్రం (రి)
ఫోన్: 8331966987

# షర్మిల ఎవరి చాణక్యం?



ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతకాలి. అయితే పోయిన చోట చీకటి ఉంది కదా అని వెలుగు ఉన్న చోట వెతికితే లభిస్తుందా? వైఎస్ఆర్‌సిపి స్థాపనలో, ఆంధ్రలో ఆ పార్టీ అధికారంలోకి రావడంలో షర్మిల కృషిని ఆ పార్టీ మరిచిపోయినా ప్రజలు మరువలేరు. అయితే జగన్ చెల్లెలికి ప్రాధాన్యమివ్వటంలేదన్నది నిజమైతే ఆంధ్రలోనే మరో పార్టీ పెట్టి పోరాడమే ఆమెకు సముచితం. పోయిందనుకుంటున్న ప్రాధాన్యం లభించడంతో పాటు అదృష్టం బాగుంటే తొలి మహిళా ముఖ్యమంత్రి కూడా కావచ్చు. మరి అవసరంలేని చోట, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందని రుజువైన తర్వాత కూడా తెలంగాణలో షర్మిల రాజకీయ అరంగేట్రం చేయాలనుకోవడమేమిటి? ఈ పరిణామంపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఎవరో వెనుక ఉండి ఆడిస్తున్న రాజకీయమని పరిశీలకులు భావిస్తున్నారు. వారెవరు? దానికి కారణాలేమిటి? తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, బీజేపీ రూపంలో టిఆర్ఎస్‌కు పొంచి ఉన్న ముప్పుతో పాటు మతపరమైన అంశాలు కూడా తోడవుతున్నాయనిపిస్తోంది. ప్రజలకు దూరమవుతున్న టిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బిజెపి ఎదుగుతున్న విషయాన్ని దుబ్బాక అసెంబ్లీ ఉపఎన్నిక, జిహెచ్ఎంసి ఎన్నికలు నిరూపించాయి. బిజెపి రాష్ట్ర విభాగం అధ్యక్షుడు బండి సంజయ్ ఆ పార్టీని ప్రజలకు చేరువ చేస్తున్నారు. అది సూర్యాపేట జిల్లా గుర్రంబొడులో అధికార టిఆర్ఎస్ నాయకులు చేశారంటున్న గిరిజనుల భూముల ఆక్రమణల విషయం కావచ్చు, దుబ్బాక ఎన్నిక సందర్భం కావచ్చు లేదా జిహెచ్ఎంసి ఎన్నికల సందర్భంగా స్వర్గీయ పీవీ సమాధి వివాదంపై ఒవైసీకి సవాలు, భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి వరద సహాయంపై లేఖ విషయంలో కేసీఆర్‌కు సవాలు విసరడం కావచ్చు.. సంజయ్ పార్టీని సరైన దిశలో నడిపిస్తూ ప్రత్యామ్నాయం తామేనని రుజువు చేస్తున్నారు. మరి షర్మిల పార్టీకి ఇక్కడ చోటు ఎలా లభిస్తుందనుకుంటున్నారు?టిఆర్ఎస్ విషయానికి వస్తే ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత పెరుగుతోంది. ఇలాంటి సంక్షోభాలు గతంలో కూడా ఆ పార్టీ ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. కేసీఆర్ ముందుచూపుతో, మాయమాటలతో ప్రజలను నమ్మించి అధికారం చేజారకుండా చూసుకోగలిగినా, ప్రస్తుతం ఆ పార్టీలోని అంతర్గత సంక్షోభాలే దాని కొంప ముంచేలా కనిపిస్తున్నాయి. మరో ప్రత్యామ్నాయం కోసం చూడడంలో భాగంగానే తెలంగాణలో షర్మిల రాజకీయ అరంగేట్రం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌లోని కీలక నాయకుల ద్వారా ఆ పార్టీ సారథ్యంలోని కూటమిలో టిడిపి చేరే విధంగా కేసీఆర్ రాజకీయ చతురతను ప్రదర్శించి తన అధికారాన్ని నిలబెట్టుకున్నారని వాదనలు వినిపించాయి. అప్పట్లో మరోసారి ఆంధ్రుల పాలన మనకవసరమా? అని తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టిన విషయం తెలిసిందే. సరిగ్గా అలాంటి పాచికనే మరోసారి వాడడంలో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో చేతులు కలిపి ఇక్కడ షర్మిలను రాజకీయరంగప్రవేశం చేసేలా కేసీఆర్ పన్నాగం పన్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.మరో కారణం కూడా చెబుతున్నారు. రాష్ట్రంలో బిజెపి బలంగా ఎదుగుతోంది. ప్రజలు బిజెపి వైపు మళ్ళకుండా చీలిక తీసుకురావడం, తెలంగాణలో నివసించే ఆంధ్ర ప్రాంతం వారు ఆ పార్టీ వైపు మళ్ళకుండా చేయడంతో పాటు వారిలో చీలిక తీసుకురావడం కూడా కేసీఆర్ లక్ష్యం అంటున్నారు. ఇందులో భాగంగానే షర్మిల ప్రవేశమని పలువురు విశ్వసిస్తున్నారు. ఎన్నికల ముందు ఆమె వస్తే ఫలితాలెలా ఉంటాయో అంచనా వేయడం కష్టమవుతుంది. గత ఎన్నికల సందర్భంగా అయితే చంద్రబాబుపై తెలంగాణ వ్యతిరేకిగా అప్పటికే ఉన్న ముద్ర ఉపయోగ పడింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్–, టిడిపి కూటమి ఉంటుందనే గ్యారంటీ లేదు. అప్పటికప్పుడు షర్మిలలాంటి వారి పాచిక పారుతుందో లేదో తెలియదు కాబట్టే ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతోనే ఈ ఎత్తుగడ వేసినట్లుగా భావిస్తున్నారు. ఒకవేళ షర్మిల పార్టీకి ఒకటి, రెండు సీట్లు వచ్చినా తమ మిత్రపక్షంగా పడి ఉంటుంది తప్ప అధికారంలోకి వచ్చే అవకాశం మాత్రం ఉండబోదని ఆయన భావిస్తుండవచ్చని అనుకుంటున్నారు. ఇలా షర్మిల ద్వారా తన అధికారాన్ని నిలబెట్టుకోవడంతోపాటు బిజెపి అధికారంలోకి రాకుండా నిలువరించవచ్చని కేసీఆర్ అంచనా వేసి ఉంటారు. తెలంగాణలో బిజెపి ఓడిపోతే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆ పార్టీని దెబ్బకొట్టి తన అధికారాన్ని నిలబెట్టుకోవచ్చని జగన్ కూడా ఆలోచించి ఉంటారు.

ఇక హిందుత్వ భావజాల సంస్థలు మరో వాదనను లేవదీస్తున్నాయి. తెలంగాణలో షర్మిల ప్రవేశాన్ని ఈ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అక్కడ జరుగుతున్న పరిణామాలను హిందువులు సహించలేకపోతున్నారు. జగన్ పాలనలో దేవాలయాలపై దాడులు, మతమార్పిడులు పెరిగాయి. దేవాలయాల్లోని విగ్రహాల విధ్వంసానికి తానే కారణమని ఒక పాస్టర్ బహిరంగంగా ప్రకటించాడంటే అక్కడి పరిస్థితిని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి దుశ్చర్యలకు వ్యతిరేకంగా విశ్వహిందూ పరిషత్‌తో పాటు బిజెపి, బజరంగ్‌దళ్ తదితర హిందుత్వ సంస్థలు తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రభుత్వానికి సన్నిహితుడైన ఒక మఠాధిపతి నోరు మెదపకపోవడం కూడా హిందువుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డ్ ఛైర్మన్ కూడా క్రిస్టియన్ మతస్థుడనే ప్రచారం కూడా జరిగింది. ఆంధ్రలో వలే తెలంగాణలో కూడా తమ మతవ్యాప్తి కార్యక్రమాలు విస్తరించడానికే క్రిస్టియన్ మతసంస్థలే షర్మిలను పంపించి ఉంటాయంటున్నారు. ఏది సత్యం? ఏదసత్యం?

# ఏ.పి. వై.ఎస్. వాయిస్ మాస పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ



మంచిర్యాల,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిది :ఏ.పి. వై.ఎస్.వాయిస్ మాస పత్రిక క్యాలెండర్ ను జిల్లా కేంద్రం లోని స్థానిక ఐబీ విశ్రాంతి భవన సముదాయంలో యువజన సంఘం ఆధ్వర్యంలో బహుజన నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్-పూలే యువజన సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ కుంటాల శంకర్ మాట్లాడుతూ బహుజన ల వాయిస్ మన ఏ.పి. వై.ఎస్. మాస పత్రిక అని,మహనీయుల ఆలోచన విధానాన్ని మహనీయులు చూపిన దారిలో మన ఏ.పి. వై.ఎస్.మాస పత్రిక వుంటుందని పేర్కొన్నారు. బహుజన ప్రజల ఆచారాలు, సంప్రదాయలు ఈ మాస పత్రిక ద్వారా తెలియజేస్తుందని తెలిపారు. అనంతరం స్వేరో సర్కిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల శ్రీనివాస్ ఏ.పి. వై.ఎస్. వాయిస్ మాస పత్రిక ప్రారంభించిందుకు బహుజన ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.,మహనీయుల ఆలోచన ప్రతి బింబమే ఏ.పి. వై.ఎస్. వాయిస్ మాస పత్రిక అని అన్నారు. అనంతరం సింగరేణి కార్మిక బిడ్డల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోళ్ల నరేష్ మాట్లాడుతూ ఏ.పి. వై.ఎస్. వాయిస్ మాస పత్రిక మన బహుజన ప్రజల పత్రిక అని బహుజనుల అభివృద్ధి లక్ష్యంగా,మాస పత్రిక విడుదల చెయ్యడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.వై.ఎస్.జిల్లా కన్వీనర్ ఎడ్ల కిష్టయ్య,జిల్లా కో కన్వీనర్ రాశపెల్లి రాజు,హాజీపూర్ మండల కన్వీనర్ సురమల్ల రాంచెందర్,పట్టణ కన్వీనర్ కొప్పర్తి భాస్కర్,లింగాల రాజసమ్మయ్య,సుధాకర్,దుర్గం రామూర్తి, కనకరాజ్,రంగు రాజేశం,దేవి సత్యం, జైపాల్ సింగ్,దుర్గం తులసిరామ్,లు పాల్గొన్నారు

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం




జన్నారం,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిది :జన్నారం మండల కేంద్రానికి చెందిన షేక్ అజీమ్ ఉద్దీన్ గత కొంత కాలంగా నరాల బలహీనత తో బాధపడుతూ చికిత్స చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో దాతలు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న మండల లయన్స్ క్లబ్ సభ్యులు బాధితునికి చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయంగా రూపాయలు 10000 నగదును గురువారం బాధితునికి అందించారు. అలాగే పేద మహిళ కూలీలకు నెల రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంజిత్ రావు గోలి మణికుమార్ కోశాధికారి సుందర్ కుమార్ డి సి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి అనుముల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## నాగలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు



జగిత్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): రాయికల్ మండల్ శ్రీ రాజరాజేశ్వర స్వామి నాగాలయం దేవాలయంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కవితకు స్వాగతం పలికి ప్రత్యేక చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఎమ్మెల్యేలు డా. సంజయ్ కుమార్ సుంకె రవిశంకర్ ఎంపీపీలు లావుడ్య సంధ్యారాణి గాజర్ల గంగారాం గౌడ్ జడ్పీటీసీలు అశ్విని జాదవ్ సంగెపు మహేష్ మున్సిపల్ చైర్మెన్స్ మోర హన్మాండ్లు బోగ శ్రావణి తెరాస నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్

### 8 వ రోజుకు చేరిన హమాలీ కార్మికుల దీక్ష




ఆసిఫాబాద్,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిది :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై జి సి సి హమాలీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల కు సంబంధించిన జీవోను విడుదల చేయాలని ఈ నెల18 వ తేదీ నుండి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రారంభించిన సమ్మె గురువారం వరకు 8 వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ కార్మిక సంఘాల నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల లో కుదిరిన ఒప్పందం ప్రకారం జీవోను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లను చెల్లించాలన్నారు. అదేవిధంగా కార్మికులకు రావలసిన 14 నెలల ఏరియర్స్ ను విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూడడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పట్ల చొరవ చూపాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వివిధ సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, సహాయ కార్యదర్శి హేమాజీ, నాయకులు కేశవ్, మోహన్, తుకారాం తిరుపతి, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఓటములు సహజం



జన్నారం,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిది : మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని విశ్రాంత ఉపాధ్యాయుడు భీమ్ లాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను గురువారం టీజీవో అధ్యక్షులు ఏ ఐ బి ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రేఖ శ్యాం నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలలో గెలుపు ఓటములు సహజమేనని ఓడినవారు గెలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అలాగే రెండవ బహుమతి కి తన వంతు గా రూపాయలు 15000 ఇస్తానని ప్రకటించారు.

## ఎదురు గుట్ట వద్ద సమ్మక్క సారక్క జాతర



భద్రాద్రి కొత్తగూడెం,ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): చర్ల మండలంలోని సుబ్బంపేట పరిధిలోని ఎదురు గుట్ట వద్ద ఉన్న సమ్మక్క సారక్క జాతర ఎంతో అంగరంగ వైభవంగా జరిగింది గత రెండు రోజుల నుంచి జరుగుతున్న యొక్క జాతర వేలమంది భక్తులతో కిటకిటలాడుతోంది. ప్రజలు వారి యొక్క కోరికలను తీర్చమని ఈ యొక్క వనదేవతలను పూజించడం అనాదిగా లో నుంచి వస్తుంది యొక్క జాతరను ఇక్కడ ఉన్న ఆదివాసీలు గిరిజన ప్రజలు ఎంతో గొప్ప విలువలతో పూజించడం జరుగుతుంది. ఇక్కడ నలుమూలల ఉన్న ప్రజలు గోదావరి ఒడ్డున స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుని కానుకలను సమర్పించడం జరిగింది. ప్రజలు ఎంతగానో పూజించే వనదేవతల గా చరిత్రలో నిలిచిన శ్రీ సమ్మక్క సారక్క వారి జాతర అంగరంగ వైభవంగా జరపడం వల్ల ప్రజల యొక్క కోరికలను తీర్చడం జరుగుతుందని ఇక్కడ ప్రజల యొక్క నమ్మకం ప్రజలకు కావలసిన వసతులు సౌకర్యాలను ఆలయ కమిటీ వారికి కావలసిన ఏర్పాట్లు చేసిందని. ఎంత మంది భక్తులతో ఉన్నాయి జాతర గొప్పగా విలువలను పొంచి ఉందని. ప్రజల యొక్క నమ్మకం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కానుకలను ఇవ్వడం జరిగింది ఈ యొక్క జాతరలో నిన్న సారలమ్మను గద్దెకు తీసుకొని రాగా ఈరోజు సమ్మక్కను గద్దెకు కాడికి తీసుకొని రావడం జరిగింది. ఈ యొక్క యాత్రలో ఎంతో మంది వేలమంది భక్తులు పాల్గొనడం జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడం కోసం వేల మంది భక్తులు ఆశ ఎదురు చూడడం జరుగుతుంది. ప్రజలు సమ్మక్క గద్దె కు రావడం లో ఎంతో సంతోషాన్ని ప్రజల ముఖంలో చూడడం జరిగింది...

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత





జగిత్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితప్రముఖ పుణ్యక్షేత్రం అయిన కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆమె వెంట రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత చొప్పదండి జగిత్యాల ఎమ్మెల్యేలు రవిశంకర్ డా. సంజయ్ కుమార్ ఉన్నారు. ఎమ్మెల్సీ కవితకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ చైర్మన్ రాజేశం గౌడ్ స్వర్ణలత కవితను కలవడానికి అధికసంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పోటీపడ్డారు.

## రాయికల్ లో వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లు పున: ప్రారంభించాలి

### ఎమ్మెల్సీ కవితకు మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి వినతి

రాయికల్, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి ): రాయికల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మే 18 వ తేదీ 2018 రోజున ప్రారంభమైన రిజిస్ట్రేషన్లను ఇటీవల నిలిపివేసి వ్యవసాయేతర రిజిస్ట్రేషన్ లను జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తరలించడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మల్లి రిజిస్ట్రేషన్ లను రాయికల్ మండలంలో పన: ప్రారంభించాలని గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రాయికల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి రాయికల్ మండల ప్రజల తరుపున వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాయికల్ లో రిజిస్ట్రేషన్ లు ప్రారంభమైన నుండి సెప్టెంబర్ 7వ తేదీ వరకు మొత్తం 3745 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయని ఇందులో 1930 వ్యయసాయ భూముల రిజిస్ట్రేషన్లు 1815 వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగాయని ఇందువల్ల దదాపు 4కోట్ల ఆదాయం ప్రభుత్వానికి అందిందని కావున తిరిగి వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లు యధావిధిగా రాయికల్ లోనే జరిగేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికోసం కవిత సానుకూలంగా స్పందించి రిజిస్ట్రేషన్లు రాయికల్ లో జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో టి.ఆర్.ఎస్ నాయకులూ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మూడో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు

అశ్వరావుపేట, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): అశ్వరావుపేట మండలంలోని వినాయకపురం పిహెచ్సి ఆసుపత్రి ముందు అంగన్వాడి పదం నాగమణి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మూడో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కోలేటి పకీరయ్య మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం ఆలోచించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, లేనిపక్షంలో నిరసనను అనేక రూపాలలో తెలియజేయడం జరుగుతుందని వారు హెచ్చరించారు .తప్పుడు సమాచారం అందిస్తూ గిరిజన కుటుంబాన్ని అబాసుపాలు చేసిన వైద్యులు రాంబాబు ని తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు కుటుంబాన్ని ఆదుకోవడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందని ఆదుకో లేనిపక్షంలో జిల్లా ఆస్పత్రి ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించబోతున్న ట్లు వారన్నారు. అన్ని సంఘాలను ఏకం చేసి రానున్న రోజుల్లో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో తగరం రాంబాబు దళిత సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ,బొంతు రవి తేజ గారు ఏజెన్సీ దళిత హక్కుల సాధన సమితి మద్దతు తెలిపారు అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కోలేటి పకీరయ్య గారు మరియు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## రాజకీయ లబ్ధి పొందడానికే వర్గీకరణను వాడుకున్నారు

### ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ మాదిగ జెఏసి వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): వివిధ రాజకీయ పార్టీలు ఎదగడానికే వర్గీకరణ అంశాన్ని వాడుకొని లబ్ధిపొందారని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ మాదిగ జెఏసి వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బిజెఆర్ కూడలిలో మాదిగ జెఏసి జిల్లా అధ్యక్షుడు ఈదన్నోల్ల రాజు ఆధ్వర్యంలో మాదిగ జెఏసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిమ్మని శంకర్ సమక్షంలో 12 శాతం రిజర్వేషన్ సాధనకై మాదిగల జాగృతి రథయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలు చేస్తున్న న్యాయం పోరాటం, బలిదానాలు రాజకీయ పార్టీల అధికార కాంక్షకు సంజీవనిలా మారిందని విమర్శించారు. మాదిగ ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కపట రాజనీతి గీతను దాటకుండా అడుగడుగునా అడ్డుతగులుతున్నారని పేర్కొన్నారు. మాదిగ జాతి న్యాయ పోరాటాలను బలిదానాలను చిన్నదిగా చేసి చూపడం అవివేకమని చెప్పారు. అగ్ర నీతి సూత్రాన్ని మాదిగ జాతిని జాగృతం చేసేందుకే రథయాత్ర లక్ష్యమని గుర్తు చేశారు. 26 ఏండ్లుగా మోసపోతున్న మాదిగ జాతిని మేల్కొల్పిన ఆవశ్యకత ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభాలో కులాల వారిగా ఎవరి జనాభా ఎక్కువ ఉంటే వారికే వాటా దక్కాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో 12 శాతం డిమాండ్ చేస్తూ మాదిగ జాతిని జాగృతం చేయుటకు ఫిబ్రవరి 18 నుండి మాదిగల జాగృతి రథయాత్రను ప్రారంభించామని పేర్కొన్నారు. మాదిగ జాతికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలనే లక్ష్యమని చెప్పారు. న్యాయమైన డిమాండ్ కు సంఘీభావం తెలపడం అభినందనీయమని కొనియాడారు. ఈ సమావేశంలో మాదిగ జెఏసి యూత్ రాష్ట్ర అధ్యక్షుడు సుందరం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి ఆనంద్, మాదిగ జెఏసి జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవులు, పట్టణ అధ్యక్షుడు ప్రభు, మాదిగ జెఏసి నాయకులు మోమిన్‌పేట్ శేఖర్, సత్తయ్య, ఆనందం, సంజీవ, ప్రభాకర్, గొట్టిముక్కల ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28 లోగా రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి..

### జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నారాయణరెడ్డి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25,(ప్రజాపాలన ప్రతినిధి ): ఈనెల 28 లోగా రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత గిరిజన అభ్యర్థులకు కార్యాచరణ ప్రణాళిక క్రింద 2020-21 ఆర్థిక సంవత్సరానికి గాను రాయితీ నిధులు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాకు 176 యూనిట్లకు గాను 10 కోట్ల 7 లక్షల రూపాయల రాయితీ నిధులు కేటాయించడం జరిగిందని, ఈ యూనిట్లను ఆయా మండలాల, మున్సిపాలిటీల వారీగా కేటాయించడం జరుగుతుందని, ఆసక్తిగల గిరిజన అభ్యర్థులకు ఈనెల 28వ తేదీలోగా సంబంధిత మండల ప్రజా పరిషత్ అధికారి / మున్సిపల్ కమిషనర్ సంప్రదించి %ంశీఎఎం. ఎస్త్రస్త్ర. స్త్రశీజ. ఱఅ% వెబ్ సైట్ నందు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఉధృతంగా తెరాస పార్టీ సభ్యత్వ స్వీకరణ

బీరుపూర్, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి): బీరుపూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో తెరాస పార్టీ సభ్యత్వాలు గ్రామంలో ఉధృతంగా తీసుకుంటున్నారు. తెరాస ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు 2 లక్షల భీమాపథకనికి ఆకర్షితులైన ప్రజలు సభ్యత్వాలు తీసుకోవడంలో ముందున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతం రమేష్ గంగాధరి సంతోష్ అవుతా సంపత్ శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# పట్టభద్రులూ.. ఆలోచించి ఓటు వేయండి

## ఎమ్మెల్సీ ఎన్నికలు వేరు.. సాధారణ ఎన్నికలు వేరు.. మొదటి ప్రాధాన్యత ఓటు అంటే ఏంటీ తెలుసుకోండి

మధిర ఫిబ్రవరి 25 ప్రజాపాలన ప్రతినిది : ప్రస్తుతం జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలోని పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలిలి

ఎమ్మెల్సీ ఎన్నిక :పట్టభద్రులు అంటే డిగ్రీ పూర్తి చేసుకున్న వారు. డిగ్రీ పూర్తి చేసుకుని 3 సంవత్సరాలై యుండాలి. అలాంటి పట్టభద్రులే ఓటుహక్కు కు అర్హులు. ఉద్యోగం చేస్తున్నవారు, నిరుద్యోగులు కూడా ఓటు వేయవచ్చు.లి

లిసాధారణంగా ఎన్నికలలో మనం మనకు నచ్చిన అభ్యర్థికి మాత్రమే ఓటు వేస్తాం, కేవలం ఆ అభ్యర్థి ఒక్కరికే కాకుండా మరొకరికి కూడా ఓటు వేస్తే చెల్లుబాటు కాకుండా పోతోంది అక్కడ .... ఎమ్మెల్సీ ఎన్నికలలో మాత్రం ఓటు వేసే ప్రక్రియ మాత్రం భిన్నంగా ఉంటుంది.లి

లిఇక్కడ మనం మనకు కావలసిన అభ్యర్థికి మాత్రమే కాకుండా మరొకరికి కూడా ఇంకో ఓటు వేయవచ్చు. పోటీలో ఎంతమంది ఉంటే అంత మందికి ఓటు వేయవచ్చు.లి

లిఇలాంటి విధానంలో మన ఓటు ఎవరికీ ఎలా వేసుకోవాలి.. ?లిలిమనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలంటే.. ?లి ఈ ప్రశ్నలకు ఒక్కటే సమాధానం. ఈ ఎం.ఎల్.సి ఎన్నికల విధానం గురించి తెలుసుండాలి.లిలిఇపుడు ఈ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల కర పత్రాలలో చూసే ఉంటారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని ప్రతి అభ్యర్థి కోరడం గమనించే ఉంటారు.లి

లి(మొదటి ప్రాధాన్యత ఓటు అంటే, మనకు నచ్చిన అభ్యర్థికి మొదట ఓటు వేయడ స్... ఇంకో అభ్యర్థికి (నెంబరు/%అబఎవతీ%) ఓటు వేయవచ్చు. ఇంకో అభ్యర్థికి 3 (నెంబరు) ప్రాధాన్యత ఓటు వేయవచ్చు అన్నమాట.లిఓ 20 మందీ బరిలో ఉంటే, వరుసగా ... వారి పేర్లు ఉండగా, మనకు నచ్చిన అభ్యర్థి వరుసలో పేరు పక్కన / బ్యాలెట్ పేపర్ లో నిర్దేశించబడిన స్థలంలో ఓటు వేయవచ్చు... 20 మంది 30 మంది అభ్యర్థులు ఉన్నాసరే, ఉదాహరణకు వరుసలో నెంబర్ 12 లో ఉంటే అక్కడ నెంబర్ 1 వేస్తే అది మొదటి ప్రాధాన్యత ఓటు అన్నమాట. ఇలా వరుసగా 30 మందికి కూడా ఓటు వేయవచ్చు.. 50 శాతం ఓట్లు ఎవరికి వస్తే వారు గెలిచినట్లు లెక్క.



మొదటి “”ప్రాధాన్యత ఓట్లు 50% రాకపోతే సదరు వ్యక్తికి పడ్డ “” ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. అక్కడ 50 శాతం రాకపోతే మళ్లీ “ ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. ఇలా 50 శాతం ఓట్లు వచ్చేవరకు లెక్కిస్తారు 50 శాతం ఓట్లు వచ్చిన వారినే గెలిచినట్లుగా ప్రకటిస్తారు.లిఓట్ల లెక్కంపులో ఈ ప్రాధాన్యత ముఖ్య పాత్ర వహిస్తుంది.లిఎన్నికల ఫలితాలు ప్రకటించే సమయంలో ఫలానా, అభ్యర్థి మొదటి లేదా రెండవ లేదా మూడవ ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు అని చెబుతారు.లి కాబట్టి జాగ్రత్త గా మీ ఓటు హక్కు వినియోగించండి.

## ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వలేదని సెల్ టవర్ ఎక్కిన యువకుడు



మధిర ఫిబ్రవరి 25ప్రజాపాలన ప్రతినిది :జీలుగుమాడు కి చెందిన రమేష్ అనే వ్యక్తి వారి తండ్రి రైల్వే ఉద్యోగం చేస్తూ ఇటీవల మరణించారు. దానికి సంబంధించిన ఫ్యామిలీ సర్టిఫికెట్ రెవెన్యూ అధికారులు ఇవ్వడం లేదంటూ ఆరోపిస్తూ సెల్ టవర్ ఎక్కినట్లు వారి బంధువులు పేర్కొంటున్నారు. సెల్ టవర్ సంఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ పోలీసులు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెంటనే కిందికి దిగి రావాలని ఫోన్ లో కోరిన పోలీసులు. సెల్ టవర్ ఘటనపై స్పందించిన తాసిల్దార్ సైదులు.లితన తండ్రి మరణించిన ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వడం లేదంటూ సెల్ టవర్ ఎక్కిన యువకుడు రమేష్ వార్త తెలుసుకున్న స్థానిక తాసిల్దార్ సైదులు ఈ విషయమై మాట్లాడుతూ రమేష్ తండ్రి శ్రీరామ రామారావు కి ఇద్దరు భార్యలున్నారు. ఇదే క్రమంలో మరో మహిళ వచ్చి నేను రామారావు భార్య నే అంటూ నాకు ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలని ఫిర్యాదు చేయడంతో వారిని పిలిచి మాట్లాడటం జరిగిందని. దీన్లోని మీ గ్రామానికి వచ్చి పూర్తి స్థాయిలో విచారణ జరిపించి అర్హులైన వారికి ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ అందిస్తామని చెప్పటం జరిగిందని తాసిల్దార్ సైదులు పేర్కొన్నారు.

## ఆశ కొండయ్య కు అభినందనలు



మధిర ఫిబ్రవరి 25 ప్రజా పాలన ప్రతినిది :ఈ రోజు కృష్ణాపురం జిల్లా మైనారిటీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నందు జరిగిన షేర్ %అస్త్రశీ% రోడ్డు సేఫ్టీ అవగాహనా సదస్సు నందు విద్యార్థులకు వ్యక్తిత్వవికాశంతో పాటు పలు దురలవాట్లు మానాలి అనే విషయాలు సంపూర్ణ%శీ%గా వివరించి నందుకు మరియు %ఎఱజ%/ఎయిడ్స్. టీబీ. కరోనా వ్యాదుల గురించి అవగాహనా పరుస్తున్న%శీ%దుకు సమాజహితం కోసం కృషి చేస్తున్న%శీ%దుకు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్ గారు మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ %బాఎ% సమీమ్ షేర్ %అస్త్రశీ% సీఈఓ గాదె గోపాలరెడ్డిచేతులు మీద గా ఘనంగా అభినందించారు. ఈ సందర్బంగా %ఇవీఓ% రమేష్ గారు మాట్లాడుతూవ్యాది రహిత సమాజం కోసం మరియు అనేక సామాజిక సేవలు అందించటం కోసం కొండయ్య లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరం అని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో జి. గోపాలరెడ్డి వాలంటీర్లు వెంకటకృష్ణ గారపాటి శ్రీనివాస్, గోపి మోహనరెడ్డి మైనార్టీ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాలకు హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు



మధిర ఫిబ్రవరి 25 ప్రజాపాలన ప్రతినిది :మొదటిగా మందడపు కుటుంబరావు గారు ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి పూలవమాలలు వేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కనక పూడి రత్నమ్మ గారు ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారులిఅనంతరం గుమ్మా పద్మాగారు ఇటీవల మరణించటంతో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కృష్ణాపురం గ్రామం లో తేజావత్ సోమ్లా గారి భార్య ఇటీవల మరణించడంతో వారిని పరామర్శించారు. అనంతరం మదిర లో నూతనంగా ఏర్పాటు చేసిన %టశ్రీఅజూ ఏశీత్% ఆఫీస్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చితారు నాగేశ్వరరావు, మధిర టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, సిరిపురం సర్పంచ్ కనక పూడి పెద్ద బుచ్చయ్య, కర్నాటి శ్రీనివాస రావు,సిరిపురం మాజీ సర్పంచ్ చావా వేణు, వంగవీటి సర్పంచ్ బొగ్గుల పద్మ, కృష్ణాపురం సర్పంచ్ బుర్రి సునీత, రెండో వార్డు కౌన్సిలర్ ఇక్బాల్,టిఆర్ఎస్ మదిర నియోజకవర్గ యువజన నాయకులు కోన నరేందర్ రెడ్డి, వెంకటాపురం ఉపసర్పంచ్ హరికిరణ్ తదితర టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

## మడుపల్లి మెయిన్ రోడ్డు డ్రైనేజీ క్లీన్



మధిర ఫిబ్రవరి 25 ప్రజా పాలన ప్రతినిది : మధిర మున్సిపాలిటీ పరిధిలో మడుపల్లి గ్రామం మెయిన్ రోడ్ హైనక్కాల్ దగ్గర డ్రైనేజీని, డ్రైనేజీ వెంట ఉన్న ముండ్ల కంచె, వయ్యారి భామ చెట్లు తొలగించే కార్యక్రమం 6,7 వార్డు కాన్సిలర్స్ తొగరు వరలక్ష్మి ఓంకార్, మేడికొండ కళ్యాణి కిరణ్ గార్ల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు తొగరు ఓంకార్, నంద్రు బాబు,మేడికొండ కిరణ్, పీట్ల పుల్లా రావు మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం వర్తక సంఘం 14వ వార్షికోత్సవం



మధిర ఫిబ్రవరి 25 ప్రజా పాలన ప్రతినిది :, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం వర్తక సంఘం మధిర 14వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం హనుమాన్ చాలీసా పారాయణం నకు సహకరించిన ధాత గుండా విజయ రామకృష్ణ లక్ష్మీ రజిని విజయవాడ వాస్తవ్యులు గజవాహనంపై స్వామివారి సేవకు సహకరించిన దాతలు వేజెండ్ల నరసింహారావుగారి కుటుంబ సభ్యులు జంగాల శేషారత్నం గారి సోదరులు మరియు సాయంత్రం ఏడు గంటలకు స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవం కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో లో శ్రీమాన్ ఎస్టి జీ మురళి కృష్ణమాచార్యులు తెనాలి వాస్తవ్యులు పంచాంగం రామానుజాచార్య సావ్ని వారి ఆధ్వర్యంలో నిర్వహించబడినది

## మహిళా క్యాబ్ డ్రైవర్లకు శిక్షణ.. జిల్లా సంక్షేమ అధికారి

మంచిర్యాల,ఫిబ్రవరి 25, ప్రజాపాలన ప్రతినిది :మహిళా క్యాబ్ డ్రైవర్లకు శిక్షణ కొసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి గురువారం ఒక పత్రికా ప్రకటన లో పేర్కొన్నారు. మహిళల సౌకర్య వంతమైన రక్షణతో కూడిన ప్రయాణం కొరకు హైదరాబాద్ నగరంలో 24/7 షీ-టాక్సీ పథకమును ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 16 టాక్సీలను 16 మంది మహిళలకు క్యాబ్ డ్రైవర్లుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రవాణా శాఖ నమన్వయంతో అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా ఎవరైతే మహిళలు క్యాబ్ డ్రైవర్లుగా ఉపాధి పొందుటకు ఆసక్తి కలిగి ఉన్న వారికి 30 శాతం నబ్సిడీ, 10 శాతం మార్జిన్ మనీ మొత్తంగా 45 శాతంను బ్యాంక్ ఋణముతో కూడిన నబ్సిడీనీ, షీ-టాక్సీ పథకం ద్వారా మంజూరు చేయబడునని తెలిపారు. షీ-టాక్సీపథకం కింద వసతితో కూడు నన్న డ్రైవింగ్ శిక్షణా కార్యక్రమాన్ని పూర్వ (10) జిల్లా కేంద్రాలలోని మహిళల ప్రాంగణాలలో ఇవ్వబడుతుందన్నారు. కోర్సు వ్యవధి 30 రోజులు, శిక్షణ సమయంలో దరఖాస్తు దారులు మహిళా ప్రాంగణాలలో వసతి కల్పించబడుననీ, బిలోపావర్టీ లైన్ కు చెందిన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడు తుందని అన్నారు. దరఖాస్తు దారురాలి వయ్సు 18 ఏళ్లు పైబడి ఉండాలి, 10వ తరగతి అర్హత ఉండాలని తెలిపారు. కావున డ్రైవింగ్ శిక్షణ పొందగోరి ( నేర్చుకోనుటకు ఆసక్తి కలిగి), ప్రొఫెషనల్ మహిళా క్యాబ్ డ్రైవర్ గా పని చేయుటకు అనక్తి గల అన్ని కేటగిరీలకు చెందిన మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవని కోరారు. దరఖాస్తులకు జిల్లా సంక్షేమ శాఖలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో కాని, సమగ్ర శిశు అభివృద్ధి పథకం కార్యాలయంలో కానీ సంప్రదించి దరఖాస్తు ఫారంను పొంది, వచ్చే నెల 02 లోగా మంచిర్యాల జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించవలెనని పేర్కొన్నారు.

## గ్రాడ్యుయేట్లు సదస్సు



మధిర ఫిబ్రవరి 25 ప్రజా పాలన ప్రతినిది, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈరోజు ఎర్రుపాలెం మండల కేంద్రంలోని సరస్వతి డిగ్రీ కళాశాల లో ఏర్పాటుచేసిన గ్రాడ్యుయేట్లు సదస్సు మరియు గురుకుల పాఠశాల, కస్తూరిబా పాఠశాలలో లోని పాఠశాల టీచర్ల కలిసి ఓటు ఓట్ల అభ్యర్థిస్తున్న టిఆర్ఎస్ పార్టీ ఫౌండర్ నెంబర్, పార్టీ మాజీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ బొమ్మెర రామ్మూర్తి గారు ఆయన వెంట తెలంగాణ జాగృతి మధిర నియోజకవర్గ ఇంచార్జ్ బొబ్బిళ్ళపాటి బాబురావు, ఎర్రుపాలెం టిఆర్ఎస్ నాయకులు గుండ్ల రత్నబాబు, పగిడిపల్లి వినోద్, బాలకృష్ణ ,రాంబాబు, వెంకట్ మోహన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## మడుపల్లి లో భావనారుషి కళ్యానం



మధిర ఫిబ్రవరి 25ప్రజాపాలన ప్రతినిది : మధిర మండలంమడుపల్లి లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గణపతి, అభయ ఆంజనేయ స్వామి, బద్రావతి-భావనారుషి, స్వామి వార్ల దేవాలయ 12 వ వార్షికోత్సవం సందర్భముగా ఈనెల 27వ తేదీ శనివారం ఉదయం 8:35 కు బద్రావతి భావనారుషి స్వామివారి కల్యాణోత్సవం జరుపబడును అని దేవాలయ కమిటీ నిర్వాహకులు యలమద్ది రాము, జిల్లా నాగేశ్వరరావులు తెలిపారు. స్వామివారి కళ్యాణము వీక్షించి, తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని వారు ఈ సందర్భంగా భక్తులను కోరారుఈ సందర్భంగా ఉదయం 11 గంటల నుండి కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## ప్రచార ఫ్లెక్సీలకు పంచాయతీ ట్రాక్టర్



రాయికల్ ,ఫిబ్రవరి 25 (ప్రజాపాలన ప్రతినిధి) : మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కొత్తపేట గ్రామములోని నాగాలయానికి దర్శన నిమిత్తం రావడంతో ఆమెకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలకు రామాజిపేట గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ను వాడుతూ ఫ్లెక్సీలు, కర్రలు రవాణా చేస్తున్నారు. ప్రజల పన్నులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ను ప్రైవేటు కార్యక్రమాలకు వినియోగించడం ప్రైవేట్ ఫ్లెక్సీ ప్రచారానికి వాడుకోవడం అధికార దుర్వినియోగం మరియు ప్రజాధనం దుర్వినియోగంగా భావిస్తున్నామని భాజపా నాయకులు అన్నారు. ఇట్టి విషయమై పంచాయతీ కార్యదర్శికి చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా తమ పనులకు ట్రాక్టర్ ను వాడుకోవడం జరిగిందని అన్నారు.

## సిద్దులూరులో క్రికెట్ టోర్నమెంట్

### గ్రామ సర్పంచ్ బంటు ఆంజనేయులు ముదిరాజ్





వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25 ( ప్రజాపాలన ) : ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని సిద్దులూరు గ్రామ సర్పంచ్ బంటు ఆంజనేయులు ముదిరాజ్ తెలిపారు. గురువారం వికారాబాద్ మండలానికి చెందిన సిద్ధులూరు గ్రామములో సిద్దులూరు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిటిసి గౌసొద్దిన్ సమక్షంలో క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ..క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు క్రీడలపైన ఆసక్తి ఉండాలని పేర్కొన్నారు. క్రీడలకు వయస్సుతో సంబంధం లేదని, ప్రతి ఒక్కరు క్రీడలు ఆడేందుకు ప్రయత్నించాలని కోరారు. క్రీడలతో స్నేహభావం, పరిచయాలు, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలు పరిఢవిల్లుతుందని గుర్తు చేశారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఎవ్వరు కూడా నిరుత్సాహ పడరాదని తెలిపారు. గెలిచిన వారు సంతోషపడుతారు, ఓడిన వారు అనుభవాన్ని పొందుతారని చెప్పారు. మొదటి బహుమతి రూ.20,000. రెండవ బహుమతి రూ.10,000 అందిస్తామని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు గ్రామ యువకులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| శైలజ | - | శేర్లింగంపల్లి | - | 8919627871 |
| సత్య కిషోర్ | - | సిద్దిపేట | - | 6309723472 |

## నాన్ సర్జికల్ లైపోసక్షన్‌తో నాజుకైన శరీరాకృతి



అందంగా కనిపించాలని అందరికీ ఉంటుంది. వయసు పైబడటం మూలంగా వచ్చే లక్షణాలను కప్పిపుచ్చుకోవాలనే ఆరాటమూ ఉంటుంది. కానీ మారిన జీవనవిధానం వల్ల శరీరాకృతి దెబ్బతింటోంది. స్థూలకాయం వచ్చిపడుతోంది. అయితే శరీరాక ృతిని కాపాడుకోవడానికి, అందంగా తీర్చిదిద్దుకోవడానికి నాన్ సర్జికల్ లైపోసక్షన్ చక్కగా ఉపయోగపడుతుందని అంటున్నారు డాక్టర్ జి. కిషోర్‌రెడ్డి. అందాలను ఇనుమడింపచేయడానికి అందుబాటులో ఉన్న కాస్మెటిక్ చికిత్సలలో ఇప్పుడు అల్ట్రాసోనిక్ లైపోసక్షన్ తాజాగా వచ్చిన అధునాతన చికిత్స. అల్ట్రాసౌండ్ విధానంలో సర్జరీ లేకుండా కొవ్వును కరిగించడం ఈ చికిత్స ప్రత్యేకత. శరీరాక ృతి అందంగా కనపడేందుకు ఇటీవలి వరకు సర్జరీ ఒక్కటే మార్గమని భావించేవారు. అయితే సర్జరీ అవసరం లేకుండా శరీరంలోని కొవ్వును కరిగించడం అల్ట్రాసౌండ్ లైపోసక్షన్‌తో ఇప్పుడు చాలా సులభం. శరీరంలో చేరిన అదనపు బరువును తొలగించడం, కొవ్వు కారణంగా ముడతలు పడిన చర్మాన్ని సరిచేయడం ఇక ఎంత మాత్రం కష్టం కాదు. శరీరంలోని ఒక నిర్ధిష్టమైన భాగంలో కొవ్వును కరిగించడం ఈ విధానం ప్రత్యేకత. ఏ భాగంలో కొవ్వును కరిగించాలో ఆ భాగంలో మాత్రమే అల్ట్రాసౌండ్ తరంగాలను పంపించి కొవ్వును కరిగిస్తారు. శరీరంపై ఎటువంటి గాటు లేకుండా, నొప్పి అనేది లేకుండా ఈ చికిత్స జరుగుతుంది. ఈ చికిత్స వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఈ చికిత్సతో ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

చికిత్సా విధానం

శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కణాలను కరిగించి, శరీరాక ృతిని అందంగా తీర్చిదిద్దడానికి అల్ట్రాసౌండ్ తరంగాలను శరీరంలోకి పంపిస్తాము. శరీరంలో కొవ్వు ఎక్కువగా పేరుకునే నడుము, పిరుదులు, తొడలు, పొట్ట తదితర ప్రాంతాలలోనుంచి కొవ్వును కరిగించడం జరుగుతుంది. అల్ట్రాసౌండ్ ద్వారా శరీరంలోని కొవ్వు శాశ్వతంగా తొలగిపోతుంది. ఒకసారి తొలగించిన కొవ్వు కణాలు మళ్లీ ఏర్పడే అవకాశం లేదు. రక్త నాళాలు, నరాలకు సంబంధించిన కణజాలానికి ఎటువంటి హాని జరగకుండా అల్ట్రాసౌండ్ తరంగాల ద్వారా చర్మంలోపల ఉండే కొవ్వు కణాలను విచ్ఛిన్నం చేయడం జరుగుతుంది. ఒకసారి తొలగించిన కొవ్వు కణాలు మళ్లీ జీవం పోసుకోలేవు. దీని వల్ల ఇవి శాశ్వతంగా తొలగిపోయినట్లే.

కరిగిన కొవ్వు ఏమవుతుంది?

అల్ట్రాసోనిక్ లైపోసక్షన్‌తో కరిగిన కొవ్వు లింఫాటిక్ సిస్టమ్ ద్వారా కాలేయంలో మెటబాలిజం జరిగి గ్లూకోజ్‌గా తయారవుతుంది. ఇలా తయారైన గ్లూకోజ్ నుంచి మనశరీరం మన రోజువారి పనులకు , వ్యాయామం కొరకు అవసరమైన శక్తిని వినియోగించుకోవడం జరుగుతుంది. ఒకవేళ మనం సరైన వ్యాయామం చేయకపోతే గ్లూకోజ్ కొవ్వులా మారి వివిధ శరీర భాగాల్లో పేరుకుపోవడం జరుగుతుంది.


చికిత్సా కాలం ఎంత?

చికిత్సాకాలం 6 నుంచి 18 సెషన్లు ఉంటుంది. వారానికి రెండు సెషన్ల చొప్పున మూడు నుంచి 18 వారాలలో చికిత్స పూర్తవుతుంది. అయితే శరీరాక ృతిని అందంగా మలచుకోవడం అన్నది రోగి చేతుల్లో కూడా ఉంటుంది. శరీరంలో నుంచి కొవ్వు తొలగిపోయిన తర్వాత రోగి బరువు తగ్గిపోతాడు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామాలను చేయడం వంటి క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకుంటే శరీరం అందంగా మారడం చాలా సులభం.

ప్రయోజనాలు

నాన్ సర్జికల్ లైపోసక్షన్ శరీరంపై ఎటువంటి గాట్లు లేకుండా, సర్జరీ లేకుండా, నొప్పి లేకుండా కొవ్వును కరిగించే చికిత్సా విధానం. నొప్పి ఉండదు. అనస్థీషియా అవసరం లేదు. మామూలుగా సర్జరీతో కూడిన లైపోసక్షన్ చేసుకున్న వారు సాధారణ స్థితికి రావడానికి వారం, పదిరోజులు పడుతుంది. కాని, నాన్ సర్జికల్ విధానంలో ఎటువంటి విశ్రాంతి అవసరం లేదు. వెంటనే తమ విధులకు హాజరుకావచ్చు. ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే ఆస్కారమే లేదు. శరీరంపైన దద్దుర్లు, చర్మం కందిపోవడం వంటివేవీ ఉండవు. చికిత్స కోసం ప్రతి సెషన్ 60 నుంచి 180 నిమిషాలపాటు ఉంటుంది. ఫలితాలు మొదటి సెషన్‌లోనే కనిపించినప్పటికీ 4 సెషన్లు పూర్తయ్యేసరికి చెప్పుకోదగ్గ శారీరక మార్పులు స్పష్టంగా కనపడతాయి. శరీరంలో ప్రతి భాగానికి కనీసం 6 నుంచి 18 సెషన్లు అవసరమవుతాయి. ఒకసారి కొవ్వు కణాలను తొలగించిన తర్వాత అవి మళ్లీ ఆ ప్రాంతంలో వచ్చే అవకాశాలు ఉండవు. చికిత్స చేసుకున్న తరువాత ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు.

## నిద్రలేమి.. జన్యులోపం!



సరిగా నిద్రపట్టడం లేదనే ఫిర్యాదులు తరచూ వింటుంటాం. కొందరు నిద్ర మాత్రలు వేసుకోవాల్సిన పరిస్థితి. మానసిక, శారీరక సమస్యల వల్ల ఈ రుగ్మత వచ్చే అవకాశం ఉంటుందని తెలుసు. అవి మాత్రమే కాదు.. జన్యులోపం వల్ల కూడా నిద్రలేమి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు తెలిపారు. నిద్రలేమికి, మానసిక రుగ్మతలకు, మధుమేహానికి గల లింకును కూడా గుర్తించినట్లు వెల్లడించారు.

## యవ్వనపుష్టికి నేలగుమ్మడి

నేల గుమ్మడి చూర్ణాన్ని, దాని రసంలో 7 రోజుల పాటు ఉంచి, ఆ తర్వాత ఎండించాలి. ఈ చూర్ణాన్ని రోజూ రెండు స్పూన్ల చొప్పున, నెయ్యితో గానీ, తేనెతో గానీ సేవిస్తే, లైంగిక శక్తి వ ృద్ధి చెందుతుంది.

చూర్ణాన్ని రెండు స్పూన్ల మోతాదులో చక్కెర కలిపిన అరకప్పు పాలతో తీసుకుంటే, పసిపిల్ల తల్లులకు పాల ఉత్పత్తి పెరుగుతుంది.

పచ్చి దుంప రసంలో చక్కెర కలిపి తాగితే అల్సర్ బాధలు తగ్గుతాయి.

దుంప ముక్కలను నీటిలో ఉడికించి, స్నానం చేస్తూ ఉంటే, ఒంటి నొప్పులు తగ్గుతాయి.

పటిక పంచదార కలిపిన పాలలో 10 గ్రాముల మోతాదులో నేల గుమ్మడి చూర్ణాన్ని కలిపి సేవిస్తూ ఉంటే, శీఘ్రస్కలన సమస్య పోతుంది. మూత్రంలో మంట రావడం కూడా తగ్గిపోతుంది. శరీరానికి చలువ చేస్తుంది. క్రమం తప్పకుండా వాడుతుంటే, శుష్కించిన దేహం, బలంగా తయారవుతుంది. దేహ పుష్టి, వీర్యవ ృద్ధితో పాటు రక్తశుద్ధి కూడా కలుగుతుంది. అంతిమంగా ఇది ఆయువ ృద్ధికి బాట వేస్తుంది.

200 మి.లీ. ఆవు పాలలో 800 మి.లీ. నీటిలో 50 గ్రాముల నేలగుమ్మడి చూర్ణం కలపాలి. ఆ తరవాత పాలు మాత్రమే మిగిలేదాకా మరిగించాలి. అందులో తగినంత పటిక పంచదార కలిపి రోజూ తాగుతూ ఉంటే, స్త్రీల రుతుచక్రం క్రమబద్ధమవుతుంది. ఈ సేవనం వల్ల శరీర ఉష్ణోగ్రత్త తగ్గడంతో శరీర సౌందర్యం కూడా ఇనుమడిస్తుంది.

# సన్నగా నాజూగ్గా....

అందమైన రూపం ఉండాలని కోరుకోని వారు ఎవ రుంటారు. సన్నగా నాజూగ్గా ఉండాలనే తాపత్రయం ప్రస్తుతం లింగ, వయో బేధాలకు అతీతంగా సమాజంలో పెరిగి పోతోంది. ఫిట్‌నెస్ సెంటర్లకు వెళ్లే వారి కన్నా ఇంటిలోనే వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసుకుని రోజు వారీ కసరత్తులు చేసేవారు నగరంలో దర్శన మిస్తున్నారు. నగ ర వ్యాప్తంగా ఉన్న నడక దారులు కిక్కిరిసిపోతున్నాయి. నడక వలన ప్రయోజనాలపై లండన్ లోని ఫిట్‌నెస్ రీసెర్చి సెంటర్ చేసిన తాజా పరిశోదనలు ఆసక్తికరమైన ఫలి తాలు వెల్లడించింది. బరువు తగ్గడంలో నడకను మించిన వ్యాయామం లేదని తేల్చింది. నగరంలో వ్యాయామ సాధనాల అమ్మకాల జోరు అదే విషయాన్ని స్పష్టం చేస్తోందనేది మార్కెట్ నిపుణుల మాట. కాళ్లకు పనిచెప్పే పరికరాలకే డిమాండ్ ఉంటోంది. వ్యాయామా లు వాటి ఫలితాల పై నిపుణుల సూచనలు, సలహా లతో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనం మీకోసం..

రూ. కోట్ల సంపద ఉన్నా చూడ చక్కని శరీరా కృతి లేనిదే ఎవరూ మన వంక చూడరు. ఉద యం, సాయంత్రం వేళల్లో వ్యాయామశాలలు, ఆట స్థలాల్లో దర్శనమిస్తున్నారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ఇళ్లలోనే అత్యాధునిక వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ట్రెడ్‌మిల్, స్టాండింగ్ సైకిల్ వంటి వ్యాయామ సాధనాలు నివాసాల్లోనే కొలువు దీరుతున్నాయి. నగరం, జిల్లా లో ఏటా రూ.10 కోట్లు విలువ చేసే వ్యాయామ సాధనాలు అమ్ముడవ తున్నాయని మార్కెట్ నిపు ణులు పేర్కొంటున్నారు. వయస్సుతో పనిలేకుండా గుండె జబ్బులు, రక్తపోటు, మధు మేహం వంటి జీవనశైలి వ్యాధులు విజ ృంభిస్తున్న తరుణంలో వ్యాయామాలపై కొంత సమయం వెచ్చిస్తున్నారు. కాళ్లకే ఎక్కువ శ్రమ కల్గించడం ద్వారా సన్న బడ వచ్చనే భావన బలీయంగా సమాజంలో నాటుకు పోవడంతో ఈ తరహా వ్యాయామ సాధనాలకు ప్రా చుర్యం వచ్చిందని నిపు ణుల అంచనా. ఈ క్రమం లో అసలు కాళ్లకు కలిగే శ్రమతో మిగతా శరీర బ రువు తగ్గుతుందా అంటే ముమ్మాటికీ అదే నిజ మంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు.

నడక ఎలా అంటే..

రోజూ నడక సాధన చేసే వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి రోజూ సూర్యోద యానికి ముందే నడక ప్రారంభించి కనీసం 45 నిమిషాలు కొనసాగిం చాలి. రోజురోజుకు నడకలో వేగం పెరిగేలా చూసుకుంటే బరువు త్వరగా తగ్గుతుందని పేర్కొంటున్నారు. శరీరం ఉండాల్సిన బరువు కంటే ఇరవై కిలోలు ఎక్కువగా ఉన్న వారు నడక ద్వారా బరువు తగ్గే ప్రయత్నం చేయ డం వలన కీళ్ల సంబంధిత సమస్య లను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరి స్తున్నారు. కీళ్లపై భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నా రు. ముందు నుంచి బరువు పెరగ కుండా అవగాహనతో కూడిన వ్యా యామం చేయడం ఉత్తమమని వైద్యు లు అంటున్నారు.

ఆడుతున్నా ఎందుకు తగ్గరంటే...

వ్యాయామ సాధనలో భాగంగా కొంత మంది ఇండోర్ గేమ్స్ ఆడుతూ ఉంటారు. శరీర బరువు మాత్రం అదుపులోకి రాదని వారు ఆందోళన చెందుతారు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసు కుని కొంత మంది చేసిన పరిశోధనలో పలు వాస్తవాలు వెలుగు చూశాయి. రోజూ ఆట కు వెళుతున్నా తగిన కదలికలు లేకుం డా ఆట కొనసాగించడం ఒక కారణంగా తేలింది. ఇం డోర్‌లో ఎలాంటి వ్యాయామం చేయ క పోయినా చెమటలు పట్ట డం సహజం. దీంతో ఆట తర్వాత ఆపే యడం బరువు తగ్గకపోవడానికి కారణమై కూర్చుంది.

కాళ్లు కదిలితేనే..

శరీరంలో అతిపెద్ద కండరాలు ఎముక, తొడ భాగంలోనే ఉన్నాయి. కాళ్లకు పనిచెబితే అధి క కొవ్వు కరుగుతుందని ఆరోగ్య నిపుణులు ఉదయపు సమయంలో నడవాలని సూచిస్తున్నారు. ఇతర వ్యాయామాలు ఎలా ఉన్నా నడక, జాగింగ్, సైక్లింగ్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, బాల్ గేమ్స్ అంశాల్లో వ్యాయామ సాధన చేసే వారిలో శరీర బరువు త్వరగా నియంత్రణలోకి వస్తోందని తాజా అధ్యయనాలు నిరూపించాయి.

ఆహారంపై అదుపు తప్పనిసరి

వ్యాయామం చేసేవారు ఉత్సా హంగా ఉంటారని పరిశోధనలు తేల్చడంతో పాటు సాధారణంగా అనుభవంలోకి వచ్చే వాస్తవం. మెదడులో ఉండే పిట్యూటరీ గ్రంధి విడుదల చేసే ఎండార్ఫిన్ అనే హార్మోన్ వ్యాయామం చేసే సమ యంలో ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అవసరానికి మించి ఆహారం తీసుకుంటారు. వ్యాయామం చేస్తున్నాం బరువు తగ్గడం లేదనే వారు తీసుకునే ఆహారంపై అదుపు సాధించాలని వైద్యులు సూచిస్తున్నారు.




# ఒబెసిటీకి గుడ్‌బై

: పిల్లాడు బొద్దుగా ఉన్నాడని ముద్దు చేస్తుంటారు. కానీ పెరిగి పెద్దయ్యాక ఆ స్థూలకాయమే అనేక అనర్థాలకు దారితీస్తుంది. స్థూలకాయం మూలంగానే రకరకాల వ్యాధులు వచ్చిపడుతున్నాయి. అయితే ఆయుర్వేద చికిత్సలతో అధిక బరువును తగ్గించుకుని ఆరోగ్యవంత మైన జీవనం గడపవచ్చని అంటున్నారు డాక్టర్ మనోహర్.

ఈ మధ్యకాలంలో స్థూలకాయం ఒక ప్రధాన సమస్యగా మారింది. చిన్న పిల్లల్లో సైతం ఈ సమస్య కనిపిస్తోంది. ప్రతీ పదిమందిలో ముగ్గురు స్థూలకాయంతో బాధపడుతున్నారు. ఈ సమస్యను ఆయుర్వేదంలో స్థౌల్యం అంటారు. స్థూలకాయం ఒక వ్యాధి కాకున్నా అనేక వ్యాధులకు కారణమవుతుంది.

కారణాలు

- ఆహారం అధికంగా తీసుకోవడం
- జంక్ ఫుడ్ తినడం
- శారీరక శ్రమ లేకపోవడం
- మానసిక ఒత్తిడి ఉండటం
- స్త్రీలలో హార్మోన్ సమతుల్యత దెబ్బతినడం
- హైపోథైరాయిడిజం
- కొన్ని రకాల మందులు ఎక్కువగా తీసుకోవడం
- వంశపారంపర్యంగా స్థూలకాయం రావడానికి కూడా అవకాశం ఉంటుంది.


కాంప్లికేషన్స్

- స్థూలకాయాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరగడంతో పాటు గుండె సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.
- డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువే.
- స్థూలకాయం వల్ల ఆర్థరైటిస్, శ్వాస సంబంధ సమస్యలు రావచ్చు.

నిర్ధారణజి

ఒక వ్యక్తి స్థూలకాయంతో బాధపడుతున్నాడని నిర్ధారించడానికి బాడీమాసఇండెక్స్(బీఎమ్ఐ)ఉపయోగపడుతుంది.

బీఎమ్ఐా బరువు కేజీలలో / ఎత్తు మీటర్లలో



బీఎమ్ఐ సూచి – పురుషుల్లో 17 నుంచి 27 స్త్రీలలో 17 నుంచి 25 ఉంటే సాధారణం అని చెప్పుకోవచ్చు. బీఎమ్ఐ 27 నుంచి 32 ఉంటే అధిక బరువు ఉన్నట్లుగా భావించాలి. 32 కన్నా ఎక్కువ ఉంటే స్థూలకాయులుగా నిర్ధారించుకోవాలి.

చికిత్సజి

స్థూలకాయం సమస్యను ఆయుర్వేదంలో మేదోరోగంగా పరిగణించడం జరిగింది. దీనికి శోదన, శమన అని రెండు రకాల చికిత్సలు అద్భుతంగా ఉపయోగపడతాయి. శోధన చికత్సలో కషాయవస్తి ప్రధాన చికిత్స అని చెప్పవచ్చు. దీనితో పాటు ఉద్వర్తనం, స్వేదనం లాంటి చికిత్సలు ఉపయోగకరంగా ఉంటాయి. శమన చికిత్సలో నాలుగవ ధాతువైన మేధోదాతువును కరిగించుటకు కొన్ని ప్రత్యేకమైన ఔషధాలు సూచించడం జరుగుతుంది. అలాగే ప్రతి వ్యక్తి కూడా అవసరమైన మేరకు శారీరక వ్యాయామం చేయడం, జీర్ణశక్తిని అనుసరించి ఆహారం తీసుకోవడం వల్ల స్థూలకాయం రాకుండా కాపాడుకోవచ్చు.

# నిలబడితే లావు తగ్గుతారట!



కూర్చుంటాం. కానీ నిలబడ్డం కూడా శరీరానికి మంచిదట. రోజూ కొద్దిసేపు నిలబడితే బరువు తగ్గుతామట. ఆశ్చర్యంగా ఉందా? ఇటీవల శాస్త్రవేత్తలు చేసిన ఒక పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. రోజులో కనీసం పావు భాగం సేపు నిలబడితే బరువు తగ్గుతారని సదరు పరిశోధకులు చెబుతున్నారు. కూపర్ ఇన్‌స్టిట్యూట్, ది యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, యూనివర్సిటీ ఆఫ్ జార్జియా సైంటిస్టులతో కలిసి అమెరికన్ కేన్సర్ సొసైటీ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. ఎక్కువ సేపు నిలబడితే ఎక్కువ ఆరోగ్య ఫలితాలు వస్తాయా లేదా అనే విషయం ఇంకా తేలాల్సి ఉంది. తమ స్టడీలో శాస్త్రవేత్తలు స్త్రీ, పురుషులను పరిశీలించారు. పురుషుల విషయానికొస్తే రోజులో పావు భాగంసేపు నిలబడ్డం వల్ల ఊబకాయం బారినపడే అవకాశాలు 32 శాతం తక్కువగా ఉందని తేలింది. రోజులో సగం సేపు నిల్చునే వారిలో ఊబకాయం రిస్కు 59 శాతం తగ్గింది. అయితే రోజులో మూడొంతులసేపు నిలుచున్న వారిలో ఊబకాయం రిస్కు తగ్గిన దాఖలాలు లేవు. ఆడవాళ్ల విషయానికి వస్తే రోజులో పావు, అర, మూడొంతుల భాగం నిలబడ్డం వల్ల ఊబకాయం రిస్కు పొట్ట భాగంలో 35, 47, 57 మేర తగ్గింది. అయితే పురుషుల్లోగాని, స్త్రీలలో గాని నిలబడడానికి, మెటబాలిక్ సింద్రోమ్‌కు ఎలాంటి సంబంధం లేదని స్టడీలో తేలింది. వ్యాయామాలు చేసే పురుషుల్లో పావు లేదా అర రోజు నిలుచోవడం వల్ల పొట్ట భాగంలో లావు 57 శాతం తగ్గింది. వ్యాయామాలు నియమంగా చేస్తూ రోజులో ముప్పావు భాగం నిలబడిన మగవారిలో పొట్ట భాగంలోని లావు 64 శాతం తగ్గింది. అయితే తక్కువ సేపు నిలుచోవడం వల్ల లావు పెరుగుతామా లేదా అనేది ఇంకా తేలాల్సి ఉంది. కానీ, గతంలో చేసిన కొన్ని పరిశోధనల్లో ఎక్కువసేపు నిలబడ్డం వల్ల వెరికోస్ వెయన్స్ రిస్కు బారిన పడతామని వెల్లడైంది. అందుకే ఎక్కువ సేపు నిలబడ్డం వల్ల ప్రత్యేకమైన ఆరోగ్య ప్రయోజనాలేమైనా ఉన్నాయా లేదో తేలడానికి ఇంకా విస్తృతస్థాయిలో పరిశోధనలు జరగాల్సి ఉందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

## నీళ్లు తాగండి...స్లిమ్‌గా ఉండండి...



లావుగా ఉన్నవాళ్లు శరీర బరువు తగ్గాలని ఉబలాటపడుతుంటారు. అందుకోసం నిత్యం వ్యాయామాలు చేస్తుంటారు. డైట్ పాటిస్తుంటారు. ఇదంతా బాగానే ఉంది. కానీ వీటితోపాటు వీళ్లు నీళ్లు కూడా తాగితే మంచిది. అదేవింటని ఆశ్చర్యపోతున్నారా? అవును మంచినీళ్లు బాగా తాగితే స్లిమ్‌గా తయారవుతారట. శరీరం బరువు తగ్గుతుందిట. ఆ విశేషాలేమిటో తెలుసుకుందామా...

రోజులో మనం ఎన్ని నీళ్లు తాగుతున్నామన్న దానిపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంది. నీళ్లు ఎక్కువగా తాగితే మన శరీరం బాగా పనిచేస్తుంది. జీవక్రియ బాగా జరుగుతుంది. అలాకాకుండా తక్కువ నీళ్లు తాగితే శరీరంలో రసాయన క్రియలు కూడా సరిగా జరగవు. ఇదంతా ఒక ఎత్తయితే, ఎక్కువ నీళ్లు తాగడం వల్ల శరీర బరువు కూడా తగ్గుతుంది. బాగా ఆకలివేసినపుడు కాలరీలు బాగా ఉన్న ఫుడ్‌ని ఎక్కువగా తినేస్తాం. ఇలాంటి సమయాల్లో ముందుగా ఒక గ్లాసుడు మంచినీళ్లు తాగామనుకోండి ఎక్కువ ఆహారం కడుపులోకి పోదు. అందుకే ఏదైనా తినే ముందు నీళ్లు బాగా తాగితే తిండి ఎక్కువ తినం. అందుకే నీళ్లు తాగడం ద్వారా తినే ఆహారాన్ని తగ్గించుకోవచ్చు. దీంతో శరీరంలోకి ఎక్స్‌ట్రా కాలరీలు శరీరం లోపలికి వెళ్లవు. అలాగే అన్నం తినే ముందు కూడా గ్లాసుడు మంచినీళు తాగితే తక్కువ ఆహారం మాత్రమే తింటాం. శరీరం లావు కాదు. నీళు ఎక్కువ తాగుతూ.... రోజులో నాలుగుసార్లు కొద్ది కొద్దిగా ఫుడ్ తినడం వల్ల శరీర బరువు పెరగకుండా అదుపులో ఉంటుంది. శాస్త్రవేత్తలు చేసిన ఒక స్టడీలో ఆహారం తినడానికి ముందు మంచినీళ్లు తాగిన వాళ్లు తాము తినే ఆహారంలో 75 క్యాలరీలను తగ్గించుకోగలిగారట. ఈ లెక్కన సంవత్సరానికి 27,375 కాలరీలు తక్కువ తినడం వల్ల నాలుగు కిలోల వరకూ శరీర బరువు తగ్గారు. అంటే ఎలాంటి శారీరక కష్టం లేకుండా కేవలం నీళ్లు తాగడం ద్వారా తమ శరీర బరువును వీళ్లు తగ్గించుకున్నారు. తిన్న ఆహారం సరిగా అరగకపోయినా కూడా బరువు పెరుగుతారు. మంచినీళ్లు బాగా తాగితే తిండి బాగా జీర్ణమవుతుంది. నీరు ఎక్కువ తాగడం వల్ల కిడ్నీలు కూడా బాగా పనిచేస్తాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడవు. మలబద్దకంలాంటి సమస్యలు తలెత్తవు.

లావు తగ్గడానికి నీళ్లు కీలకంగా వ్యవహరిస్తాయని పలు అధ్యయనాల్లో కూడా తేలింది. ఒక స్టడీలో అధికబరువుతో బాధపడుతున్నవాళ్లు, మధ్యవయసులో ఉండి లావుతో బాధపడుతున్న మొత్తం 48 మందిని శాస్త్రవేత్తలు పరిశీలించారు. వీరందరికీ తక్కువ కాలరీలున్న ఆహారాన్ని పెట్టారు. కొందరి చేత మటుకు అన్నం తినేముందు 500ఎంఎల్ నీళ్లు తాగించారు. మూడు నెలల తర్వాత వీరందరినీ పరిశీలిస్తే అన్నం తినేముందు నీళ్లు తాగని వారికంటే నీళ్లు తాగిన వాళ్లు రెండు కిలోల బరువు తగ్గారని వెల్లడైంది. ఇంకొక స్టడీలో వయసుతోపాటు బరువు పెరిగిన వారిపై నాలుగేళ్లు అధ్యయనం చేశారు. దీంట్లో నీరు ఎక్కువగా తాగేవారు, కూల్‌డ్రింకులకు బదులు నీళ్లను మాత్రమే తాగిన వారు తక్కువ బరువుతో ఉన్నట్టు వెల్లడైంది. ఇంతకూ చెప్పేదేమిటంటే బరువు తగ్గడానికి డైట్ పాటిస్తున్న వాళ్లు ఫ్లూయిడ్స్ విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. నీళ్లను బాగా తాగాలి. సుగర్, యాడిటివ్స్ లేని ఫ్రూట్ జ్యూసులను తీసుకోవాలి. ఫ్రూట్ జ్యూసుల్లో పోషకవిలువలు ఉన్నట్టే వెజిటబుల్ జ్యూసుల్లో కూడా ఉంటాయి కాబట్టి వెజిటబుల్ జ్యూసును కూడా నిత్యం తీసుకోవాలి. వీటిల్లో కాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. మీగడలేని పాలు లేదా తక్కువ ఫ్యాట్ ఉన్న పాలను తీసుకోవాలి. వీటిల్లో కాలరీలు తక్కువ ఉండి కాల్షియం ఎక్కువగా ఉంటుంది. బ్లాక్ కాఫీ, గ్రీన్ టీ రెండూ కూడా మంచివే. వీటిల్లో యాంటాక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాలరీలు ఉండవు. కార్బొనేటెడ్ డ్రింక్స్‌కు కూడా ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఎందుకంటే వీటిల్లో కాలరీలు అధికంగా ఉంటాయి, పోషకవిలువలు మాత్రం ఉండవు. అలాగే ఎనర్జీ డ్రింకులకు కూడా దూరంగా ఉండాలి. వీటిల్లో కూడా కాలరీలు అధికంగా ఉంటాయి. ఆల్కహాల్ కూడా శరీరానికి మంచిది కాదు. ఇందులో కూడా కాలరీలు ఎక్కువగా ఉంటాయి. అందుకే శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు శరీర బరువును అదుపులో పెట్టడానికి రోజూ నీళ్లు బాగా తాగాలి.

# సినిమా స్పాట్

## ఉప్పెన విషయంలో షాకిచ్చిన బన్నీ.. ఎలాగంటే?

టాలీవుడ్ స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఇటీవలే ఓ చిన్న వేకేషన్ కోసం దుబాయ్ వెళ్లాడట. అయితే దుబాయ్ నుండి తిరిగిరాగానే బన్నీ ఏదైనా కబురు వినిపిస్తాడనే ఉద్దేశంలో ప్రేక్షకులు ఉన్నా రు. మరి దుబాయ్ వెళ్ళొస్తే ఎదురుచూడటం ఎందుకని అనిపించవచ్చు. కానీ అసలు విషయం ఏంటంటే.. అల్లు అర్జున్ ఇప్పటివరకు ఉప్పెన సినిమా చూడలేదట. మెగా ఫ్యామిలీ నుండి వచ్చిన వైష్ణవ్ తేజ్ హీరోగా డెబ్యూ అయిన సినిమాను అదే ఫ్యామిలీకి చెందిన అల్లు అర్జున్ చూడకపోయే సరికి జనాలు షాక్ అవుతున్నారు. అయితే తాజాగా బన్నీ దుబాయ్ నుండి హైదరాబాద్ చేరుకున్నాడట. మరి ఇప్పటికైనా ఉప్పెన సినిమా చూసి బన్నీ ఏదైనా ప్రశంస లేదా ట్వీట్ చేస్తాడనే మెగా ఫ్యాన్స్ కూడా వెయిట్ చేస్తున్నారు. అయినా ఆల్రెడీ బాక్సాఫీస్ దగ్గర హిట్ అందుకున్న ఉప్పెన సినిమా ను బన్నీ కొత్తగా పొగడటానికి ఏంలేదు. ఎందుకంటే ఆల్రెడీ ప్రేక్షకులే సినిమాకు బ్రహ్మ రథం పట్టేసారు. ఎంతోమంది బిగ్ సెలబ్రిటీలు సినిమా చూసి కొనియాడారు. కానీ కజిన్ సినిమా ఇంకా చూడలేదంటే ఆశ్చర్యపోవా ల్సిందే అంటు న్నారు నేటిజన్లు. మరో విషయం ఏంటంటే.. ఉప్పెన సినిమాను ప్రెసెంట్ చేసింది నిర్మాణంలో భాగమైంది డైరెక్టర్ సుకుమార్. ప్రస్తుతం అదే డైరెక్టర్ తో అల్లు అర్జున్ మూడో సినిమా చేస్తున్నాడు. కాబట్టి తప్పకుండా ఉప్పెన సినిమా చూసి తన అభిప్రాయం సుకుమార్ తో లేదా అభిమానులతో సోషల్ మీడియాలో తెలియజేయవచ్చని అంటున్నాయి సినీవర్గాలు. చూడాలి మరి బన్నీ ఉప్పెన విషయంలో ఏం చెబుతాడో! ఇదిలా ఉండగా.. ప్రస్తుతం బన్నీ పుష్ప సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగష్టులో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## ఈ గ్యాప్‌లో మహేష్ కొత్త సినిమా అనౌన్స్ చేస్తాడా..?



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ఇటీవలే దుబాయ్ లో 'సర్కారు వారి పాట' మూవీ భారీ షెడ్యూల్ పూర్తిచేసి ప్రస్తుతం విరామంలో ఉన్నాడు. అయితే సర్కారు మూవీ తర్వాత మహేష్ తదుపరి ఏంటనేది ఇంకా తెలియలేదు. మహేష్ కూడా తదుపరి సినిమా పై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కానీ ఇప్పుడైతే మహేష్ పలువురు దర్శకులతో తదుపరి సినిమా పట్ల చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. అలాగని నెక్స్ట్ సినిమా గురించి మహేష్ అంత ఆత్రంగా కూడా లేడు. ఇటీవలే లేడీ డైరెక్టర్ సుధా కొంగర అలాగే రాధేశ్యామ్ డైరెక్టర్ రాధాకృష్ణకుమార్ వినిపించిన స్క్రిప్ట్ లను తిరస్కరించాడని టాక్. నెక్స్ట్ షెడ్యూల్ ప్రారంభం అయ్యేలోపు మహేష్ చాలా సమావేశాలను ప్లాన్ చేసాడట. అలాగే చాలామంది డైరెక్టర్స్ చెప్పనున్న కథలు స్క్రిప్ట్ లను వినడానికి సిద్ధంగా ఉన్నాడట. నిజానికి మహేష్ బాబు 'సర్కారు వారి పాట' సినిమా తర్వాత డైరెక్టర్ రాజమౌళి తెరకెక్కించే చిత్రంలో పాల్గొనాల్సి ఉంది. కానీ రాజమౌళి సినిమాకంటే ముందు మరో సినిమా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నాడట మహేష్. ఇంకా యంగ్ డైరెక్టర్స్ అనిల్ రావిపూడి భీష్మా ఫేమ్ వెంకీ కుడుముల ఈ వారంలో మహేష్ బాబును కలిసి స్క్రిప్ట్ వినిపిస్తారట. స్క్రిప్ట్ విన్న మహేష్ తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీవర్గాలు చెబుతున్నాయి. అయితే సర్కారు వారి పాట తదుపరి షెడ్యూల్ మార్చ్ మధ్యలో నుండి ప్రారంభం కానుంది. పరశురామ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మొదటిసారి కీర్తిసురేష్ మహేష్ తో రొమాన్స్ చేయనుంది. ఆగష్టు వరకు షూటింగ్ పూర్తిచేసి వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేసే ప్లాన్ లో ఉన్నారు మేకర్స్.

## 'ఉప్పెన' జోరు తగ్గిందిగా.. 13వ రోజున భారీగా పడిపోయిన కలెక్షన్లు..! మొత్తం ఎంతంటే?



భారీ ప్రమోషన్స్ తో.. భారీ హైప్ తో రిలీజైన 'ఉప్పెన'.. అంతకు మించి సక్సెస్ సాధించింది. బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకున్న ఈ మూవీ.. నెవ్వర్ బిఫోర్ రికార్డులు నమోదు చేసింది. కలెక్షన్ల వర్షం కురిసిన ఈ సినిమా.. డెబ్యూ విభాగంలో సరికొత్త రికార్డులు నమోదు చేసింది. తొలిరోజు క్లైమాక్స్ పై కాస్త డివైడ్ టాక్ వినిపించినప్పటికీ.. అది ఏ మాత్రం ఎఫెక్ట్ చూపించలేదు. అద్దిరిపోయే కలెక్షన్లతో రెండో వారంలోనూ ఉవ్వెత్తున ఎగసింది. అయితే.. 13వ రోజున మాత్రం ఉప్పెన ప్రభావం తగ్గింది. మెగా హీరో కావడం.. మంచి ప్రమోషన్ జరగడంతో 'ఉప్పెన' ప్రీ రిలీజ్ బిజినెస్ భారీగానే జరిగింది. ఈ సినిమా నైజాం హక్కులు రూ. 6 కోట్లు సీడెడ్ రైట్స్ రూ. 3 కోట్లు ఆంధ్రా ప్రాంత హక్కులు రూ 10 కోట్లు వరకూ అమ్ముడు పోయాయి. ఓవర్సీస్తో కలుపుకుంటే మొత్తంగా రూ. 20 కోట్ల వ్యాపారం జరిగింది. దీంతో రూ. 21 కోట్ల వసూళ్లు లక్ష్యంగా రిలీజ్ అయ్యిందీ చిత్రం. అయితే.. అంచనాలు అమాంతం పెరిగిపోవడం.. సినిమాపై పాజిటివ్ టాక్ రావడంతో.. భారీ ఓపెనింగ్స్ వచ్చాయి. ప్రస్తుత తీరు చూస్తుంటే.. కలెక్షన్ల సునామీ సృష్టించేట్టు కనిపిస్తోంది. ఈ సినిమా మొదటి రోజు రూ. 9.35 కోట్లు షేర్ రాబట్టింది. రూ.15.10 కోట్లు గ్రాస్ సాధించి సత్తా చాటింది. బ్రేక్ ఈవెన్ టార్గెట్ ను కేవలం మూడు రోజుల్లోనే అధిగమించింది. ఈ జోరును 12వ రోజు వరకూ కొనసాగించింది 'ఉప్పెన'. 'ఉప్పెన' మొదటి రోజున రూ. 9.35 కోట్లు 2వ రోజున రూ. 6.86 కోట్లు 3వ రోజున రూ. 8.26 కోట్లు 4వ రోజున రూ. 4.17 కోట్లు 5వరోజున రూ. 3.12 కోట్లు 6వ రోజున రూ. 1.93 కోట్లు 7వ రోజున రూ.1.44 కోట్లు 8వ రోజున రూ. 1.13 కోట్లు 9వ రోజున రూ. 1.49 కోట్లు 10వ రోజున రూ. 2.61 కోట్లు 11వ రోజున రూ. 1.15 కోట్లు సాధించింది. అయితే.. 12వ రోజున కోటికి దిగువన కలెక్షన్లు రాబట్టింది. ఈ రోజు రూ.80 లక్షల వసూళ్లు వచ్చాయి. 13వ రోజుకు వచ్చే సరికి కలెక్షన్లు మరింతగా పడిపోయాయి. కేవలం రూ. 49 లక్షలు మాత్రమే రాబట్టింది. మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో రూ. 42.80 కోట్ల షేర్ వసూలు చేసింది ఉప్పెన. మిగిలిన ఇండియాలో రూ. 2.18 కోట్లు ఓవర్సీస్లో రూ. 1.29 కోట్లు కలెక్ట్ చేసింది. దీంతో.. 13 రోజుల్లో మొత్తం 46.27 కోట్లు రాబట్టింది. ఇందులో పెట్టిన పెట్టుబడి 21 కోట్లు పోగా.. ఇప్పటి వరకు రూ. 25.27 కోట్లు లాభాలను ఆర్జించింది. ఈ విధంగా ఎవ్వరూ ఊహించని విజయాన్ని నమోదు చేసింది ఉప్పెన.

## మెగాస్టార్ నట విశ్వరూపమే 'ఆచార్య'



చిరంజీవి కథానాయకుడిగా కొరటాల శివ 'ఆచార్య'ను రూపొందిస్తున్నాడు. అధర్మంపై ధర్మం చేసే దండయాత్రగా ఈ కథ నడవనుంది. మ్యాట్నీ సంస్థతో కలిసి చరణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన చిత్రీకరణ చాలావరకూ జరిగింది. ప్రస్తుతం 'మారేడుమిల్లి' ఫారెస్టులో చిరంజీవి – చరణ్ కాంబినేషన్లోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఒళ్లు గగుర్పొడిచేలా ఈ పోరాట సన్నివేశాలు ఉంటాయని అంటున్నారు. కాజల్ కథానాయికగా కనువిందు చేయనున్న ఈ సినిమాలో చరణ్ – పూజా హెగ్డే ప్రత్యేక పాత్రల్లో మెరవనున్నారు. కథాకథనాలపై .. సంభాషణలపై కొరటాల శివకి మంచి పట్టు ఉంది. థియేటర్లో కూర్చున్న ప్రేక్షకులు గెస్ చేసినట్టుగా కాకుండా కథను మరో మలుపులోకి తీసుకెళ్లడం ఆయన ప్రత్యేకత. ఏ సీన్ ఎక్కడా అనవసరం అనిపించకుండా ఆర్డర్లో ఆసక్తికరంగా కథను తీసుకెళ్లడంలో ఆయన సిద్ధహస్తుడు. ఇక సంభాషణల విషయంలోను ఆయన ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. వందమాటల్లో చెప్పవలసిన భావాన్ని ఒకే ఒక్క డైలాగ్ లో చాలా సింపుల్ గా చెప్పించేస్తాడు. అయితే ఆ డైలాగ్ చాలాడెప్త్‌గా .. తీవ్రంగా ఉంటుంది. అలా తనదైన స్టైల్ నుంచి ఎక్కడా పక్కకి వెళ్లకుండా .. చిరంజీవి క్రేజ్ కి ఎంతమాత్రం తగ్గకుండా కొర టాల ఈ సినిమాను రూపొందిస్తు న్నాడు. ఇక చిరంజీవి అంటేనే డాన్సులను .. ఫైట్లను ఫ్యాన్స్ ఒక రేంజ్‌లో ఊహించుకుంటారు. అం దువలన కొరటాల వాటి విషయంలో పూర్తిశ్రద్ధ పెట్టినట్టుగా చెబుతు న్నారు. మణిశర్మ ఇచ్చిన ట్యూన్లు మాంఛి ఊపుతో ఉత్సాహంగా సాగనున్నా యనే టాక్ ఇప్పటికే వినిపిస్తోంది. ఇక 'తిరు' ఫొటోగ్రఫీ ఈ సినిమా హైలైట్స్ లో ఒకటిగా నిలవనుందని అంటున్నారు. ఇప్పటికే బయటికి వచ్చిన చిరంజీవి లుక్ కి నూటికి నూరు మార్కులు పడిపోయాయి. చరణ్ లుక్ కూడా డిఫరెంట్‌గా ఉండ నుంది. కాజల్ వయ్యారాలు.. పూజా హెగ్డే సొగసులు ప్రత్యేక ఆక ర్షణగా నిలవనున్నాయి. కథ .. స్క్రీన్ ప్లే .. మాటలు .. పాటలు .. డాన్సులు .. ఫైట్లు .. ఇలా మెగా అభిమానులకు విందు భోజనంలా కొరటాల ఈ సినిమాను సిద్ధం చేస్తున్నట్టుగా చెబుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఆచార్య' సినిమాతో కొరటాల చూపించేది చిరంజీవి విశ్వరూపమేనని అంటున్నారు. భారీ అంచనాల మధ్య మే 13వ తేదీన ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

## చై బ్రో .. మా సామ్‌ని అలా వదిలేశావ్ ఏంటీ?



టాలీవుడ్ లెక్కల మాస్టారు సుకుమార్ ఇంట వేడుక గురించి తెలిసినదే. ఆ ఈవెంట్ కి టాలీవుడ్ అగ్ర తారలు పలువురు హాజరయ్యారు. మహేష్– నమ్రత.. ఎన్టీఆర్– ప్రణతి జంటతో పాటు నాగచైతన్య– సమంత జోడీ హాజరయ్యారు. వీళ్లలో చై–సామ్ జోడీ షో స్టాపర్స్ గా నిలిచారనే చెప్పాలి. చై ఫార్మల్ లుక్ లో నవమన్మధుడినే తలపించగా.. సామ్ దివినుంచి దిగి వచ్చిన దేవతాసుందరిని తలపించింది. అందుకు సంబంధించిన ఫోటోలు అక్కినేని ఫ్యాన్స్ లో వైరల్ గా మారాయి. టాలీవుడ్ మన్మధుడు అక్కినేని నాగార్జుననే తలపించేలా యువ సామ్రాట్ చైతూ లుక్ అదిరింది అంటూ అభిమానులు వ్యాఖ్యానించారు. క్లీన్ షేవ్ తో కనిపిస్తున్న చైతూ లుక్ అదిరింది. మహేష్ .. ఎన్టీఆర్ లాంటి స్మార్ట్ హీరోలు పక్కనే వున్నా ఎందుకనో చై ఈసారి హైలైట్ అయ్యాడు. చై–సామ్ జంట ఈవెంట్ కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అయితే ఈ జంటపై కొందరు అభిమానుల కామెంట్లు వేడెక్కించాయి. ఒక అభిమాని కాస్త ఆవేదనగానూ టీజ్ చేశాడు. ఇంతకీ ఏమన్నాడు?అంటే.. చై బ్రో .. మా సామ్ ని అలా వదిలేశావ్ ఏంటీ? తాను రెండు సార్లు నీ హ్యాండ్ పట్టుకోవడానికి ట్రై చేస్తోంది. మీరు మాత్రం స్టైల్ గా ఫస్ట్ గా వాక్ చేసుకుని వెళ్లిపోతున్నారు. మీ హ్యాండ్ పట్టుకోవాలని సపోర్ట్ కావాలని సామ్ ప్రయత్నిస్తోంది అని ఆవేదన చెందాడు. మీకు భార్య కాక ముందే ఆమె లేడీ బాస్ మా సమంత..! అంటూ కాస్త కలతగా ఉన్న ఈమోజీల్ని షేర్ చేశాడు ఆ అభిమాని. ఇక చైతన్య స్మార్ట్ లుక్ పైనా గాళ్స్ విపరీతమైన టీజింగ్ కామెంట్లు చేశారు. స్మార్ట్ యంగ్ బోయ్! అంటూ వ్యాఖ్యల్ని జోడించారు చాలా మంది అభిమానులు. చై చాలా యంగ్ గా కనిపిస్తున్నా రని.. . క్యూట్ పెయిర్ అని అభిమా నులు ప్రశంసించారు. అన్నట్టు కలత చెందిన సామ్ వీరాభిమానికి చైతూ ఏమని సమాధానమిస్తాడో చూడాలి.